

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శనివారం సాయంత్రం)	సెహరీ (ఆదివారం ఉదయం)
రాయచోటి	6.31	4.52
మదనపల్లె	6.33	5.00
రాజంపేట	6.29	5.00
పీలేరు	6.31	4.52



ములకలచెరువు పెట్రోల్ బంకు, ఆర్టీసీ బస్టాండు వద్ద ఇరుగ్గా ఉన్న జాతీయ రహదారి



ములకలచెరువు బస్టాండు సర్కిల్ నుంచి వెడల్పుగా ఉన్న జాతీయ రహదారి

ఒకే ఊరిలో... రెండు విధాలుగా...!

- ఇష్టానుసారంగా జాతీయ రహదారి విస్తరణ పనులు
- సగం ఒకలా....మిగతా మరోలా...
- మధ్యలో డివైడర్ ఊసేలేదు
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

ఊరు ఒక్కటే...విస్తరణ మాత్రం రెండు విధాలుగా చేపట్టారు. ములకలచెరువులో జరిగిన ముంబాయి-చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనులు ఇష్టానుసారంగా చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నేషనల్ హైవే అధికారుల ముందు చూపు లేక అస్తవ్యస్తంగా జాతీయ రహదారి విస్తరణ పనులు జరగడం విమర్శలకు దారి తీస్తోంది. విస్తరణ పనుల్లో మధ్యలో ఎక్కడా డివైడర్ ఏర్పాటు చేయలేదు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

ములకలచెరువు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి-అన్నమయ్య జిల్లా సరిహద్దు నుంచి మదనపల్లె వరకు ఉన్న 43 కిలోమీటర్ల ముంబాయి-చెన్నై జాతీయ రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.480.10 కోట్లు విడుదల చేసింది. 2022 డిసెంబరులో ప్రారంభమైన విస్తరణ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ములకలచెరువులోని జాతీయ రహదారిలో ఉన్న స్థానిక రైల్వేగేటు నుంచి పెట్రోల్ బంకు, ఆర్టీసీ బస్టాండు, బస్టాండు సర్కిల్ నుంచి షాదీమహల్ వరకు ఉన్న రెండు కిలో మీటర్ల రోడ్డును విస్తరణ చేశారు. అయితే ములకలచెరువులో చేపట్టిన విస్తరణ పనులు సక్రమంగా చేయలేదన్న విమర్శలున్నాయి.

స్థానిక రైల్వేగేటు నుంచి మార్కెట్ యార్డు వరకు రోడ్డుకు ఇరువైపులా సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ రోడ్డు కూడా వెడల్పు తక్కువగా ఉంది. సర్వీస్ రోడ్డు వదిలి రోడ్డుకు ఇరువైపులా దిమ్మెలు ఏర్పాటు చేయడంతో రోడ్డు వెడల్పు తగ్గిపోయింది. సిమెంటు దిమ్మెలతో రోడ్డు ఇరుగ్గా మారి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అలాగే మార్కెట్ యార్డు నుంచి బస్టాండు సర్కిల్, షాదీమహల్ సమీపం వరకు విస్తరణ తరువాత రోడ్డు బాగా వెడల్పుగా ఉంది. ఇక్కడ రోడ్డు వెడల్పుగా ఉండడంతో స్థానికులకు, వాహనదారులకు ఇబ్బందులు కలగడం లేదు. జాతీయ రహదారిలోని ప్రతి ఊరు, పట్టణాల్లో మధ్యలో డివైడర్ పెట్టి ఇరువైపులా వాహనాలు వెళ్లే విధంగా ఉంటుంది.



మార్కెట్ యార్డు సమీపంలో రోడ్డు కనపడకుండా పేరుకుపోయిన మట్టి

అయితే ములకలచెరువులో మాత్రం రోడ్డు మధ్యలో డివైడర్ కనిపించదు.

తరచుగా స్తంభిస్తున్న ట్రాఫిక్

ములకలచెరువులో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వేగేటు నుంచి మార్కెట్ యార్డు వరకు ఉన్న రోడ్డులో ఇరువైపులా ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలతో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం కలుగుతోంది. సర్వీస్ రోడ్ వదిలి ఇరువైపులా సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులను ఎక్కించుకునేందుకు బస్సులు నిలుపుతుండడంతో జాతీయ రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఒక్కోసారి వాహనాలు బారులుతీరి నిలిచిపోతున్నాయి. రోడ్డు వెడల్పు తక్కువగా ఉన్న చోట ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా మట్టి భారీగా పేరుకుపోయింది. మూడు నెలల క్రితం కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకొచ్చి రోడ్డుపై నిలిచి పోయింది. రోడ్డుపై ఉన్న మట్టి కారణంగా ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా విస్తరణ పనులు చేపట్టాం

ములకలచెరువులో ప్రణాళికాబద్ధంగానే విస్తరణ పనులు చేపట్టాము. ముఖ్యంగా సర్వీసు రోడ్డులో ద్విచక్రవాహనాలు, ఆటోలు రాకపోకలు సాగించేలా మధ్య ఉన్న రోడ్డులో బస్సులు, కార్లు, లారీలు, ఇతర వాహనాలు వెళ్లేలా పనులు చేశాము. నేషనల్ హైవే ఏడీజీ అప్రూవల్‌తో ఇరువైపులా సర్వీస్ రోడ్డు మధ్యలో వాహనాలు రాకపోకలు సాగించేలా పనులు చేశాం.

- మధుసూదన్, ఎన్‌హెచ్ ఏఈఈ, మదనపల్లె



అస్తవ్యస్తంగా విస్తరణ పనులు

ములకలచెరువులో జాతీయ రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తంగా చేపట్టారు. ఒకే ఊరిలో రెండు రకాలుగా పనులు చేపట్టడం విడ్డూరంగా ఉంది. రైల్వేగేటు నుంచి మార్కెట్ యార్డు వరకు సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందిగా మారింది. మార్కెట్ యార్డు నుంచి షాదీమహల్ వరకు వెడల్పుగా ఉంది. రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి ఇరువైపులా రాకపోకలు సాగించేలా పనులు జరిగి ఉంటే బాగుండేది. రోడ్డు ప్రమాదాలు కూడా అంతగా జరిగేవి కాదు.

- వెంకటరమణ, మెడికల్ స్టోర్ నిర్వాహకుడు, ములకలచెరువు



ఇరుకైన రోడ్డుతో ప్రమాదానికి గురయ్యాను

పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారి ఇరుకుగా ఉండడంతో రోడ్డు ప్రమాదానికి గురయ్యాను. ద్విచక్ర వాహనంలో వెళుతుంటే రోడ్డు ఇరుగ్గా ఉండడంతో బొలేరో వాహనం ఢీకొంది. దీంతో తలకు, చేతులకు బలమైన గాయాలై కోమాలోకి వెళ్లి దేవుడి దయతో కోలుకున్నా. వైద్య చికిత్సకు రూ.4 లక్షల వరకు ఖర్చయింది. ఎక్కడా లేని విధంగా ములకలచెరువులో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి రెండు పక్కల వాహనాలు వెళ్లేలా పనులు చేసి ఉంటే బాగుండేది.

- నూర్ అహమ్మద్, ములకలచెరువు

హత్య కేసులో నలుగురికి జీవితఖైదు

- తీర్పు ఇచ్చిన 2వ ఏడీజే కోర్టు



హత్య కేసులో జీవితఖైదు పడిన ముద్దాయిలు

మదనపల్లెటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో 11 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన పూల వెంకటాచలపతి హత్య కేసులో నిందితులకు మదనపల్లె 2వ ఏడీజే కోర్టు జీవితఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఏపీపీ జయనారాయణరెడ్డి కథనం మేరకు.. మదనపల్లె పట్టణం చంద్రాకాలనీలో 2014 సంవత్సరం ఆగస్టు 16వ తేదీ రాత్రి పూల వెంకటాచలపతి అనే వ్యక్తిని కొందరు దారుణంగా హత్య చేశారు. అప్పట్లో మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదుతో టూటౌన్ సీఐ గంగయ్య 179/2014 సెక్షన్ 302తో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో ధనేశ్వర్‌రెడ్డి, రామిశెట్టి కిశోర్, దాసారు గంగాధర్, అమరనాథ్, డి.శ్రీనివాసులు, మల్లికార్జున, సురేంద్రరెడ్డిలను నిందితులుగా గుర్తించిన పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసు 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో విచారణ జరిగింది. ఈ క్రమంలో ఏ1 నిందితుడు ధనేశ్వర్‌రెడ్డి 2021 సంవత్సరంలో తంబళ్లపల్లె మండలంలో హత్యకు గురి కాగా, ఏ3 నిందితుడు అమరనాథ్ 2017 సంవత్సరంలో ముదివేడు పోలీసుస్టేషన్ పరిధిలో హత్యకు గురయ్యాడు. మిగిలిన నలుగురు నిందితులపై కోర్టు విచారణలో నేరం రుజువు కాగా వీరికి ఒక్కొక్కరికి రూ.20 వేల జరిమానాతో పాటు జీవిత ఖైదు విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థ బలోపేతం చేశామని, దీనివలన నేరం చేసిన నిందతులు ఎవ్వరూ తప్పించుకునే పరిస్థితి ఉండదన్నారు. నేరస్థులకు చట్టపరంగా శిక్షలు పడేలా కేసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ముద్దాయిలకు శిక్ష పడటంలో కృషి చేసిన ఏపీపీ జయనారాయణరెడ్డి, మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, టూటౌన్ సీఐ రామచంద్ర, కోర్టు లైజనింగ్ అధికారి జి.సతీష్‌కుమార్, హెచ్‌సీ బాలసుబ్రమణ్యంలను ఎస్పీ అభినందించారు.

దార్శనిక కార్యాచరణ రూపకల్పన

- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు దార్శనిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి అర్హులైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి విజన్ స్వర్ణాంధ్ర-2047 కోసం జిల్లా, జిల్లాలోని నియోజకవర్గాలకు దార్శనిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి 5 మందిని ఎంపిక చేస్తామన్నారు. ఇందుకు మహిళా పోలీస్/ సర్వే అసిస్టెంట్/వీఆర్వో/వార్డు రెవెన్యూ సెక్రటరీ/వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీల అర్హత ఉండాలన్నారు. స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్, ఎకనామిక్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఎంబీఏ, ఇంజనీరింగ్‌లలో ఏదైనా ఒక దానిలో బ్యాచిలర్ డిగ్రీ ఉండి బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ ఉన్న వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు ఫారాలను కలెక్టరేట్‌లోని ముఖ్య ప్రణాళిక అధికారి వారి కార్యాలయం నుంచి గానీ ఎంపీడీవో కార్యాలయాల నుంచి గానీ అన్నమయ్య జిల్లా వెబ్‌సైట్ ద్వారా గానీ తీసుకుని నింపిన దరఖాస్తు ఫారాలను కలెక్టరేట్‌లోని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో అందచేయాలని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరికీ మంచి జరగాలి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి




ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి మండిపల్లి, కలెక్టర్ శ్రీధర్

రాయచోటి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాయచోటి పట్టణంలో ఫ్రూట్స్ మండీల ఆవరణంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్వమతాల సారాంశం ఒక్కటేనని ఉపవాసదీక్షలు, ఆరాధన, ప్రార్థనలు, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ఉద్దేశ్యమన్నారు. ముస్లింలు ఈ మాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారని అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమం నా చేతుల మీదుగా జరిపించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో భక్తిశ్రద్ధలతో ఉపావాసాలు ఉంటూ మూడు పూటల నమాజ్ చేసుకోవడం ద్వారా తమ పవిత్రతను చాటుకుంటారని అన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లింలు, మత పెద్దలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలకు అధ్యక్షుల నియామకం

- పీలేరుకు పురం రామ్మూర్తి
- వాల్మీకిపురానికి చంద్రమౌళి
- కలికిరికి మాలతి



పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూరి

వాల్మీకిపురం మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి

కలికిరి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మాలతి

పీలేరు/వాల్మీకిపురం/కలికిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, వాల్మీకిపురం, కలికిరి మార్కెట్ కమిటీల చైర్మన్‌లను ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) అధ్యక్షుడిగా టీడీపీ సీనియర్ నేత పురం రామ్మూర్తి నియమితులయ్యారు. పురం రామ్మూర్తి ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. వివాదరహితుడిగా పేరుపొందిన ఆయన 30 ఏళ్లుగా ప్రజా జీవితంలో ఉన్నారు. ఆయన, ఆయన సతీమణి పురం రెడ్డమ్మ, అన్నావదినలు పీలేరు పంచాయతీ వార్డు సభ్యులుగా పనిచేశారు. ఈ సందర్భంగా పురం రామ్మూర్తి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు ఏఎంసీ చైర్మన్‌గా నియమించేందుకు కృషి చేసిన నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పీలేరు మండలంలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రామ్మూర్తికి ఏఎంసీ చైర్మన్ పదవి దక్కడం పట్ల స్థానిక టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

వాల్మీకిపురానికి చంద్రమౌళి...

వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కోసూరి చంద్రమౌళిని ప్రభుత్వం నియమించింది. నూతన చైర్మన్‌గా నియమితులైన కోసూరి చంద్రమౌళి తండ్రి కోసూరి నరసింహులు గతంలో మూడుసార్లు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, సింగిల్‌విండో అధ్యక్షుడిగా, సూపర్‌బజార్ అధ్యక్షుడిగా పని చేసి దశాబ్దాల రాజకీయంలో ఎన్నో పదవులను అలంకరించారు. నూతన చైర్మన్‌గా ఎన్నికైన చంద్రమౌళి 2013 నుంచి మూడు సార్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి రావడం పట్ల సీఎం చంద్రబాబునాయుడు, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కలికిరికి మాలతి...

కలికిరి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా జి.మాలతిని ప్రభుత్వం నియమించింది. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సొంత పంచాయతీలోని తెల్లగుట్ట దళితవాడకు చెందిన మాలతి గతంలో ఆ పంచాయతీ సర్పంచుగా ఎన్నికయ్యారు. అంతేగాకుండా కలికిరి మండల జడ్పీటీసీగా కూడా పనిచేశారు. ప్రస్తుతం కలికిరి ఏఎంసీని ఎస్సీ మహిళకు రిజర్వ్ చేయడంతో మాలతికి అవకాశం దక్కింది. తనకు పదవి రావడానికి కృషి చేసిన కిశోర్‌కుమార్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాగా మార్కెట్ కమిటీకి మరో 15 మంది డైరెక్టర్లతో పాటు చైర్‌పర్సన్ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి అధికారికంగా వెలువడాల్సి ఉంది.

క్లిక్.. క్లిక్... లంకమలలో కెమెరాలకు చిక్కిన వన్యప్రాణులు

సిద్దవటం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతంలోని కొండూరు బీట్‌లో అరుదైన జింక జాతికి చెందిన చింకారా అటవీ అధికారులు అమర్చిన కెమెరాకు చిక్కిందని ఫారెస్ట్ రేంజర్ కళావతి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం రేంజర్ కళావతి మాట్లాడుతూ పులుల గణనలో భాగంగా మార్చి 5న సిద్దవటం రేంజిలోని 7 ఫారెస్ట్ బీట్‌లలోని 64 లొకేషన్లలో 128 కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 24న కెమెరాలోని డేటాను సేకరించామని చెప్పారు. ఈ కెమెరాల్లో అరుదైన వన్యప్రాణులు, చింకారాతో పాటు చిరుత పులులు, ఎలుగుబంట్లు, నెమళ్లు, పునుగుపిల్లి, ముళ్ల పంది, కొండ గొర్రెలు, మచ్చల జింక, అడవి కుక్కలు, పలు రకాల పక్షులు ఇవన్నీ అటవీ ప్రాంతంలో పెట్టిన కెమెరాలకు చిక్కాయని తెలిపారు. ఏప్రిల్ 14న కెమెరాలోని డేటాను మరోసారి పరిశీలిస్తామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, బీట్ అధికారులు పాల్గొన్నారు.



లంకమలలో చింకారా జింక



నెమలి



చిరుతపులి సంచారం



అడవి కుక్కలు




ఎలుగుబంటి



నీరు తాగుతున్న కొండ దుప్పులు

సుర్రుమంటున్న సూరీడు



- ప్రారంభంలోనే భానుడి ఉగ్రరూపం
- ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలాగో ?
- జాగ్రత్త పడకపోతే ప్రమాదం

పీలేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా మార్చిలో ప్రారంభమయ్యే వేసవి తీవ్రత ఏప్రిల్‌లో పుంజుకుని మేలో పతాకస్థాయికి వెళుతుంది. కానీ ఈ ఏడాది మాత్రం భానుడు మార్చి ఆరంభం నుంచే తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం 8 గంటల నుంచే తన తీవ్రతను ప్రదర్శిస్తూ మధ్యాహ్నానికి విశ్వరూపం చూపుతున్నాడు. మార్చిలోనే ఎండలు ఇలా మండిపోతుంటే ఇక ఏప్రిల్, మే మాసాల్లో ఎలా అని సామాన్యులు జడుసుకుంటు న్నారు. అయితే అనివార్యమైన ఈ ఉపద్రవాన్ని ఉపాయంతో ఎదుర్కోవాలని, తగిన జాగ్రత్తలు పాటిస్తే వేసవి నుంచి సురక్షితంగా బయటపడ వచ్చని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

హీట్ ఎగ్జాషన్....

ఎండ వేడికి తట్టుకోలేకపోవడం వల్ల తీవ్ర నీరసం, నిస్సత్తువ, నిస్త్రాణ (హీట్ ఎగ్జాషన్) తలెత్తుతుంది. దాని కారణంగా చెమట విపరీతంగా పట్టి శరీరం చల్లబడుతుంది. రక్తపోటు పడిపోతుంది. అప్పుడు దాహం, కళ్లు తిరగడం, బలహీనత, ఏకాగ్రత కుదరకపోవడం, వికారం, మత్తుగా అనిపించడం వంటి సమస్యలు ఏర్పడతాయి. కొందరు దీన్ని వడదెబ్బగానూ పొరపడుతుంటారు. వడదెబ్బలో చెమట పట్టదు. వేడి నిస్త్రాణలో చెమట పడుతుంది. శరీర ఉష్ణోగ్రత మామూలుగానే ఉంటుంది. తాకితే చర్మం చల్లగానూ అనిపిస్తుంది. వెంట్రుకలు నిక్కబొడుచుకుంటాయి. నాడి వేగం పెరగొచ్చు లేదా మామూలుగానైనా ఉండొచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బకు దారి తీసే ప్రమాదముంది. శిశువులు, చిన్నపిల్లలు, వృద్ధులకు వేడి నిస్త్రాణ ముప్పు ఎక్కువ. ఊబకాయులు, వేడిని తట్టుకోలేని వారికీ దీనివల్ల ముప్పు ఉంటుంది. నీరసం, బడలికగా అనిపిస్తే వెంటనే చల్లటి ప్రదేశానికి వెళ్లాలి. నీరు ఎక్కువగా తాగాలి. అనంతరం డాక్టర్‌ను సంప్రదించాలి.

కండరాలు పట్టేయటం...

కండరాలు సజావుగా పనిచేయటానికి సోడియం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి లవణాలు అవసరం. శరీరంలో వీటి మోతాదు తగ్గిపోతే కండరాల పనితీరు అస్తవ్యస్తమై, బిగుసు కుపోవచ్చు. దీంతో విపరీతమైన నొప్పి పుడుతుంది. చాలా వరకు పిక్క కండరాలు పట్టేస్తుంటాయి. చేతులు, కడుపు కండరాలూ పట్టేయచ్చు. కాళ్లు, చేతులు కొంకర్లు పోవచ్చు కూడా. ఎండలో ఎక్కువ సేపు గడపడం, నడవటం, వ్యాయామం, పనులు చేయడం వంటివి కండరాలు పట్టేయటానికి కారణ మవుతుంటాయి. అధిక రక్తపోటు, మధుమేహం గలవారికీ దీని ముప్పు ఎక్కువే. కండరాలు పట్టేసి నప్పుడు చల్లటి ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవడం ముఖ్యం. చల్లటి నీరు, పానీయాలు తాగాలి. నీటిలో కాస్త ఉప్పు, చక్కెర గానీ ఓఆర్‌ఎస్ పొడిని గానీ కలిపి తాగితే మంచిది. మజ్జిగలో ఉప్పు, నిమ్మరసం కలిపి అయినా తాగొచ్చు.



పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో సేద తీరుతున్న భవన నిర్మాణ కార్మికులు

సొమ్మసిల్లడం...

ఎండలోకి వెళ్లినప్పుడు ఉన్నట్లుండి సొమ్మసిల్లడం (హీట్ సింకోపీ) మరో సమస్య. దీనికి కారణం మెదడుకు తగినంత రక్తం అందక పోవడం. చెమట పట్టే క్రమంలో చర్మానికి రక్త సరఫరా పెరుగు తుంది. అదే సమయంలో మెదడుకు తగ్గుతుంది. ఇది మనుషులను సొమ్మసిల్లేలా చేస్తుంది. తల తిప్పటం, తలనొప్పి, వికారమూ ఉండచ్చు. ఎండను తట్టుకోలేని వారికి, వృద్ధులకు, రక్తపోటును తగ్గించే బీటా బ్లాకర్ల రకం మందులు వేసుకునే వారికి, ఇతర దీర్ఘకాల సమస్యలు గలవారికి ముప్పు ఎక్కువ. సొమ్మసిల్లటం తాత్కాలికమే అయినా జాగ్రత్త అవసరం. ఎండకు స్పృహ తప్పిన వారిని వెంటనే నీడకు చేర్చాలి. రక్తపోటు బాగా తగ్గినా, మరీ నీరసంగా ఉన్నా ఆసుపత్రికి చేర్చాలి.

వడదెబ్బ...

ఇది చాలా తీవ్రమైన సమస్య. చెమట పట్టే క్రమంలో రక్తంలోని ద్రవం బాగా ఆవిరి అవ్వొచ్చు. ఇదిలాగే కొనసాగితే ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ కుప్పకూలుతుంది. చివరికి చెమట పట్టడమూ ఆగిపోతుంది. ఇదే వడదెబ్బ. కొందరికి 106 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత పెరగొచ్చు. ఇందులో చర్మం పొడిబారుతుంది. ముట్టుకుంటే శరీరం కాలుతుంటుంది. నీరు, రక్తం పరిమాణం తగ్గటం వల్ల రక్తపోటూ పడిపోతుంది. రక్తం గడ్డకట్టే ప్రక్రియ కూడా అస్తవ్యస్తమవుతుంది. క్రమంగా అవయవాలు విఫలమై కోమాలోకి వెళ్లిపోవచ్చు. ఫిట్స్ రావొచ్చు. పరిస్థితి మరీ విషమించి ప్రాణాపాయమూ సంభవించొచ్చు. చాలామంది ఎండలోకి వెళితేనే వడదెబ్బ తగులుతుందని భావిస్తుంటారు. కానీ వేడి గాలి, వేడి వాతావరణం ప్రభావంతో ఇంట్లో ఉన్నా వడదెబ్బ తగలవచ్చు.



నిర్మానుష్యంగా ఉన్న పీలేరు పాతబస్టాండు

చల్లబరచటం ప్రధానం

వడదెబ్బ తగిలిన వారి శరీరం చల్లబడేలా చూడడం ప్రధానం. ఎండలో ఉంటే వెంటనే నీడకు చేర్చాలి. బిగుతైన దుస్తులు, టెర్లిన్, పాలిస్టర్ దుస్తులు ధరిస్తే తొలగించాలి. వదులైన, కాటన్ దుస్తులు వేయాలి. గాలి బాగా ఆడేలా చూడాలి. తడి గుడ్డతో ఒళ్లంతా తుడవాలి. శరీరం మీద నీళ్లు గుమ్మరించి ఫ్యాను గాలి తగిలేలా చూడాలి. ఐస్ ముక్కలను ప్లాస్టిక్ బ్యాగులో వేసి ఒళ్లంతా అద్దాలి. వడదెబ్బ చాలా త్వరగా ప్రాణాపాయానికి దారి తీస్తుంది. కాబట్టి సత్వర చికిత్స అవసరం. ఆసుపత్రిలో ఐస్ బాత్, సెలైన్ ఎక్కించడం వంటి వాటి ద్వారా ఉష్ణోగ్రత తగ్గేలా చేస్తారు.

ముప్పు ఎవరికి...

చిన్నపిల్లలు, వృద్ధులకు దాహం వేసే విషయం అంతగా తెలియదు. దీంతో నీరు తగినంతగా తాగరు. స్వేదగ్రంథులు తక్కువగా ఉండడం వల్ల చెమట అంతగా పట్టదు. వయసు మీద పడ్డ వారిలో చాలామంది అధిక రక్తపోటు వంటి సమస్యలకు మందులు వేసుకుంటుంటారు కూడా. వీటితోనూ వడదెబ్బ ముప్పు పెరగొచ్చు.

ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి

- డాక్టర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, పీలేరు



వేసవిలో వచ్చే సమస్యలను అధిగమించాలంటే ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. నిమ్మరసం కలిపిన మజ్జిగ, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, దోస కాయలు, పుచ్చకాయలు, చీనీకాయలు, దానిమ్మ వంటి పండ్లు తీసుకోవాలి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్యలో వృద్ధులు, చిన్నపిల్లలు బయటకు వెళ్లకపోతేనే మంచిది. వ్యాయామాలు కూడా ఉదయం 8 గంటలలోపు ముగించాలి. వేసవిలో మద్యపానం, మసాలా పదార్థాల జోలికి వెళ్లకపోవడం మంచిది.

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి హామీ పనులను పరిశీస్తున్న పీడీ ఆదిశేషారెడ్డి

సిద్దవటం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న తోటల పెంపకం, గోకులం షెడ్ల పనులను ఉపాధి పీడీ ఆదిశేషారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని శాఖరాజుపల్లె, ఉప్పరపల్లె, చాముండేశ్వరిపేటల్లో ఆయన పర్యటించారు. ఉపాధిహామీ నిధులతో సాగు చేస్తున్న పైర్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. శాఖరాజుపల్లెలో గోకులం షెడ్డు నిర్మాణాన్ని, ఉప్పరపలెలో ఫారంపాండ్ పనులను పరిశీలించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని కూలీలు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు మాత్రమే పనులు చేయాలని, కూలి మొత్తం పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నరసింహులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రేపటి నుంచి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

నందలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : స్మాషర్స్ షటిల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈనెల 30, 31 తేదీల్లో అన్నమయ్య, కడప జిల్లా స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్, నాన్ మెడలిస్ట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నందలూరు రైల్వే కేంద్రంలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో టోర్నమెంట్ నిర్వహించనున్నామని, ఔత్సాహిక క్రీడాకారులు ఈనెల 29వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి 7 వేలు, రెండో బహుమతి 5 వేలు, మూడో బహుమతి 3 వేలు, నాలుగో బహుమతి 2 వేలతోపాటు షీల్డ్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతిఒక్కరికి మెడల్స్ ఇస్తామని, ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్మాషర్స్ షటిల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వేసవిలో లేగదూడలను సంరక్షించుకోవాలి



వెలిగల్లులో లేగ దూడల ప్రదర్శనలో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై

పెద్దమండ్యం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వేసవిలో లేగ దూడలను సంరక్షించుకోవాలని పాడి రైతులకు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై పిలుపునిచ్చారు. మండలంలోని వెలిగల్లులో రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవులకు పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లేగ దూడల జాతి లక్షణాలు, శరీర బరువు, యాజమాన్య పద్ధతులు వివరించారు. దూడల బరువును వాటి ఆరోగ్య పరిస్థితిని గుర్తించాలన్నారు. మేలు జాతి లేగ దూడల సంరక్షణ పద్ధతులు అవలంబించిన రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. వేసవిలో పచ్చి గడ్డి మేతకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బాలసుబ్రమణ్యం, మదనపల్లి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ సుమిత్ర, పెద్దమండ్యం, తంబళపల్లి పశు వైద్యాధికారులు విక్రమ్‌రెడ్డి, ఉస్మాన్, సుజన, సర్పంచ్ సరస్వతి, రైతులు పాల్గొన్నారు.

ఐదు ఎక్స్‌కవేటర్లు సీజ్



సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్లు

వాల్మీకిపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్న ఐదు ఎక్స్ కవేటర్లను శుక్రవారం పోలీసు, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. వాల్మీకిపురం పట్టణానికి భోగంపల్లె రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా జరుగుతోందని, అక్క ఇసుక తవ్వకాలను ఉపేక్షించేది లేదంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయినా శుక్రవారం వేకువన కొందరు ఇసుక తరలిస్తున్నట్లు ఫిర్యాదులందాయి. దీంతో దాడులు నిర్వహించి ఇసుక తవ్వుతున్న 5 ఎక్స్‌కవేటర్లు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఒంటరి మహిళపై దాడి

● ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్న బాధితులు



చికిత్స పొందుతున్న లక్ష్మి

పెద్దతిప్పసముద్రం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ కోసం కిరాణా దుకాణం నడుపుకుంటున్న ఒంటరి మహిళపై కొందరు వ్యక్తులు దాడి చేసి గాయపర్చిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. కాట్నగల్లు హరిజనవాడకు చెందిన పెద్దకొండిగాళ్ల సూరప్ప కూతురు లక్ష్మి భర్త చనిపోవడంతో పుట్టింట్లోనే ఉంటోంది. కుటుంబాన్ని పోషించుకునేందుకు తన ఇంటి పక్కనే ఉన్న ఖాళీ జాగా ఓ బంకు ఏర్పాటు చేసుకుంది. ఆ బంకు తమ స్థలంలో ఉందంటూ ఈ నెల 23 సాయంత్రం ఇదే గ్రామానికి చెందిన కొమ్ము వెంకట్రమణ తన కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మి అమె కుటుంబ సభ్యులతో గొడవపడి, దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన కూతురిని మదనపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు సూరప్ప తెలిపాడు. గంగజాతర బందోబస్తులో ఉన్నామని జాతర అయిపోగానే ఇరువర్గాలను పిలిపించి న్యాయం చేస్తామని ఎస్ఐ తెలిపారని, దాడి జరిగి నాలుగు రోజులు అవుతున్నా కనీస చర్యలు తీసుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



రామాంజనేయులు (ఫైల్ ఫొటో)

రాజంపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పుల్లంపేట మండలం బావికాడపల్లెకు చెందిన ఫొటో స్టూడియో యజమాని రామాంజనేయులు (29)గా గుర్తించారు. అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కొందరు, వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్లు మరికొందరు చెబుతున్నారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెట్టుకు ఉరి వేసుకొని పూజారి ఆత్మహత్య

బి.కొత్తకోట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ పూజారి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని బడికాయలపల్లె బీసీ కాలనీకి చెందిన తలారి కృష్ణప్ప(58) అదే గ్రామంలోని ఈరమద్దెమ్మ గుడికి పూజారిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఓ చింతమానుకు ఉరి వేసుకున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు వున్నారు. కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కొడుకు వీరభద్ర పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు సీఐ జీవన్‌గంగానాథ్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వివాదాస్పద భూమి పరిశీలన



బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

రామసముద్రం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం ఎర్రనేలపల్లెలోని వివాదాస్పద భూమిని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ శుక్రవారం పరిశీలించారు. సర్వే నెంబర్ 218/1సీ లోని 2.75 సెంట్ల ప్రభుత్వ భూమి విషయంలో ఆరునెలలుగా లక్ష్మమ్మ, పార్వతమ్మల మధ్య వివాదం నెలకొంది. ఈ విషయంపై లక్ష్మమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ వివాదాస్పద భూమిని పరిశీలించారు. రామసముద్రం తహసీల్దార్ నిర్మలాదేవి, డివిజనల్, సర్వేయర్ దిలీప్‌కుమార్ సమక్షంలో సర్వే చేసి బాధిత మహిళ లక్ష్మమ్మకు స్వాధీనం చేశారు. అయితే పార్వతమ్మ ఇందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొన్నేళ్లుగా ఈ భూమి తన అనుభవంలో ఉందని, ఈ భూమి లేకపోతే ఎలా బతకాలని సబ్‌కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఈ భూమికి బదులుగా వేరొకచోట భూమి ఇస్తామని చెప్పారు. అనంతరం మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీలో భూ రీసర్వేను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. అరికెల పంచాయతీ చిట్టెంవారిపల్లెలో దారి విషయంలో గ్రామస్తుల మధ్య నెలకొన్న వివాదంపై మాట్లాడి ఇరువర్గాలకు ఆమోదయోగ్యంగా సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తామని తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట

- పురుషులకు డ్వాక్రా తరహా సంఘాలు
- మెప్మా పీడీ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

మదనపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మెప్మా పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, రీసోర్స్ పర్సన్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ..మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా కొత్త పథకాలను తీసుకొస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలని, పది మందికి తక్కువగా ఉన్న గ్రూపుల్లో కొత్త వారిని చేర్చాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన పురుషులు, చేతివృత్తిదారులకు సంఘాలు ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాలని సూచించారు. పురుషుల సంఘాలకు తమ వృత్తిలో నైపుణ్యాలు పెంచుకునే విధంగా రుణాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ముఖ్యంగా. పేద, మధ్య తరగతి ప్రజలు, పలు రంగాల్లో పనిచేసే కార్మికులను గ్రూపుల్లో చేర్చడం ద్వారా ఆర్థికంగా పురోగతి సాధించాలని సంఘ సభ్యులు, ఆర్పీలకు సూచించారు. అనంతరం మహిళల ఆరోగ్యం, సమాజంలో వారి పాత్ర, నడవడిక, కుటుంబ ఆరోగ్యం, పిల్లల పెంపకం, తదితర వ్యక్తిగత, సామాజిక అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమీషనర్ కే.ప్రమీల, సీఎంఎం మధుసూధన్‌రెడ్డి, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లెలో చోరీ



దుండగులు పగులగొట్టిన బీరువా

సిద్దవటం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లె సాయినగర్‌లో నివాసం ఉన్న రఘురామయ్య గృహంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి కథనం మేరకు రఘురామయ్య భార్య లీలావతి 10 రోజులుగా హైదరాబాదులోని తన కుమారుల సాయంతో అక్కడి అంకుర ఆస్పత్రిలో చికిత్స పొందు తోంది. మార్చి 26న బుధవారం రాత్రి రఘురామయ్య భార్యను చూసేందుకు హైదరాబాదుకు వెళ్లాడు. ఆ సమ యంలో గుర్తు తెలియని వ్యక్తులు తన ఇంట్లో చోరీ చేశారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీరువాలో దాచిన రూ.45 వేల నగదు, నాలుగు జతల కమ్మలు, ఒక చైను తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో పోలీ సులు క్లూస్ టీం సాయంతో సంఘటన స్థలంలో తనిఖీ చేశా రు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

జాబ్ మేళాతో ఉద్యోగ కల్పన

తంబళ్లపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు పొందడానికి జాబ్ మేళా చక్కటి వేదికని ప్రభుత్వ ఐటీఐ టీవో నాగరాజు అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివిన యువత హాజరయ్యారు. వీరికి ముత్తూట్ ఫైనాన్స్ హ్యుండయ్ మొబైల్ కంపెనీ ప్రతినిధులు కళ్యాణ్, రవితేజ ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ చూపిన ఏడుగురిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా టీవో మాట్లాడుతూ..నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య, ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లు సురేంద్ర, రమణ, అశోక్, యువత పాల్గొన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని ఈ సందర్భంగా నిర్వాహకులు అభినందించారు.

ఉగాది సందర్భంగా కవులకు సత్కారం



కవులను సత్కరించిన ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్

రాజంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగను పురస్కరించుకుని అన్నమయ్య జిల్లాలోని పలువురు కవులను శుక్రవారం నెల్లూరుకు చెందిన కేంద్ర ప్రభుత్వ ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వారు ఘనంగా సత్కరించారు. నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజంపేట తెలుగు పండితులు, కవి, రచయిత గంగనపల్లి వెంకటరమణ , ఉపాధ్యాయుడు, ప్రముఖ ఇంద్రజాలికుడు యూపీ రాయుడు, చిట్వేలికి చెందిన కవి, ఉపాధ్యాయులు దొండ్లవాగు శ్రీనివాసులు, తాళ్లపాక గ్రామానికి చెందిన కవి బాలరాజు జనార్దన్‌రాజు సన్మానం అందుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఉగాది లక్ష్మికి స్వాగతం, శుభ స్వాగతం పేరిట గంగనపల్లె వెంకటరమణ, ఓ మనిషీ.. ఇక మిగిలేదేముంది.. చెప్పేదేముందంటూ యూపీ రాయుడు గేయ కవిత, ఒక్క వాన పేరుతో చిట్వేలికి చెందిన ఉపాధ్యాయుడు దొండ్లవాగు శ్రీనివాస్, ఉగాది ఆకాంక్షల పేరుతో బాలరాజు జనార్దన్‌రాజు ఆలపించిన కవితలు అలరించాయి.

అలరించిన అన్నమయ్య సంకీర్తనల ఆలాపన



సంకీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు

రాజంపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పదకవితా పితామహుడు తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమాచార్యుల 522వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సంగీతసభ , హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. రాజంపేట మండలం మండలం తాళ్లపాక ఆర్చి అన్నమయ్య ఉద్యానవనంలోని అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు కె.సుబ్రమణ్యం, సి.దేవికాబృందం, సంగీత సభ నిర్వహించారు. జీఎస్‌కే సీతా లక్ష్మీ బృందం హరికథ కాలక్షేపం నిర్వహించారు.

నిత్యపూజ ఆలయ హుండీలోని కానుకల లెక్కింపు



హుండీలోని కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

సిద్దవటం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిత్యపూజ ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 27 నుంచి మార్చి 28 వరకు హుండీలోని కానుకలు లెక్కించగా రూ. 72,470 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనార్దన్, హెడ్‌కానిస్టేబుల్ రమణ, ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు సిబ్బంది, ఫీల్డ్ ఆఫీసర్ సురేంద్రబాబు, మెసెంజర్ సతీష్, జ్యోతి, వెంకటసుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, అర్చకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మునిగోపాల్ కృష్ణకు డాక్టరేట్



డాక్టరేట్ పట్టాతో మునిగోపాలకృష్ణ

మదనపల్లె అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఢిల్లీ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డే ప్రినిక్ ఇంటర్‌నేషనల్ యూనివర్సిటీ వారు ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడుమునిగోపాల్ కృష్ణకు శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. హైదరాబాదులో బిర్లా ప్లానిటోరియం ఆడిటోరియంలో ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మునిగోపాల్ కృష్ణ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సమస్యలపై తన భార్య ధనలక్ష్మి నిర్మాణంలో కనువిప్పు, ఆవేదన లఘుచిత్రాలు తీశానన్నారు . కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి, జనరల్ సెక్రటరీ రామచంద్రరావు, మోతుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



పగడాల చంద్రకుమార్, ఇన్‌సెట్‌లో చంద్రకుమార్ (ఫైల్)

బద్వేలుటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక పురుగుల మందు తాగి శుక్రవారం పగడాల చంద్రకుమార్ (36) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని పెద్దఅగ్రహారంలో నివాసం ఉండే చంద్రకుమార్ అప్పులు ఎక్కువ చేశాడు. ఈ నేపథ్యంలో అప్పులు ఇచ్చిన వారి నుంచి వేధింపులు పెరగడంతో.. ఆ బాధను భరించలేక బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోయి శుక్రవారం పట్టణంలోని నెల్లూరురోడ్డులో ఉన్న ఓ లాడ్జిలో పురుగులమందు తాగి మృతి చెందాడు. మృతుడు ఉన్న గది నుంచి దుర్వాసన రావడంతో అక్కడ పనిచేసే సిబ్బంది వెళ్లిచూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, మృతుడు చంద్రకుమార్‌కు అదే గ్రామానికి సుమతితో వివాహమైంది. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీ.. వృద్ధురాలు మృతి



కడప క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఉక్కాయపల్లె సమీపంలోని బైపాస్ రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు కడప ట్రాఫిక్ సీఐ జావీద్ తెలిపారు. గురువారం రాత్రి నడుచుకుంటూ వెళుతున్న ఆమెను వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడి కక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతి చెందిన వృద్ధురాలికి 65 సంవత్సరాలు ఉంటుందని, ఇతర వివరాల కోసం 9121100539 లేదా కడప ట్రాఫిక్ పోలీసుస్టేషన్ వచ్చి తెలుసుకోవాలని సీఐ తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



రాజశేఖర్ మృతదేహం

కడప క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామరాజుపల్లెలోని ఎస్సీ కాలనీకి చెందిన రాజశేఖర్ (24) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాలుకా సీఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. రాజశేఖర్ డిగ్రీ బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గత ఏడాది నుంచి కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. కడుపు నొప్పి తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

గోపవరం ఉపసర్పంచ్ ఎన్నికకు బ్రేక్

- ఎన్నిక నిర్వహణాధికారికి అస్వస్థత
- వాయిదా వేసిన అధికారులు





వార్డు మెంబర్లను తనిఖీ చేసి ఎన్నికల కేంద్రంలోకి పంపుతున్న పోలీసులు, అస్వస్థతకు గురైన రామాంజనేయులరెడ్డిని ఆస్పత్రికి తరలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా గురువారం చోటు చేసుకున్న హింసాత్మక ఘటన నేపథ్యంలో కోరం లేకపోవడంతో అధికారులు వాయిదా వేసిన విషయం తెలిసిందే. శుక్రవారం చేపట్టిన ఎన్నికకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి వార్డు మెంబరును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఒక్కొక్కరిని ఎన్నిక కేంద్రంలోకి అనుమతించారు. ఉదయం 11 గంటల నుంచి ఈ ఎన్నిక ప్రక్రియ మొదలైంది. జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ప్రొద్దుటూరు తహసీల్దారు గంగయ్య ఎన్నిక సరళిని పరిశీలించారు. కాగా, ఎన్నిక కేంద్రంలో వార్డు సభ్యుల మధ్య గతంలో కుదుర్చుకున్న ఒప్పంద వ్యవహారమై వాగ్వాదం చోటు చేసుకుంది. బీసీ అభ్యర్థిని ఉపసర్పంచుగా ఎన్నుకోకపోవడానికి కారణం మీరంటే మీరని ఒకరిపై ఒకరు ఆరోపిస్తూ వాగ్వాదానికి దిగడంతో కొంత ఘర్షణ వాతవాతరణం నెలకొంది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణ అధికారి, ఈవోపీఆర్డీ రామాంజనేయులరెడ్డి అస్వస్థతకు లోనయ్యారు. చాతినొప్పి రావడంతో హుటాహుటిన ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ పరిణామాలను జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో వారి ఆదేశాల మేరకు ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు గోపవరం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ అధికారికంగా ప్రకటించారు. కలెక్టర్ తదుపరి ఉత్తర్వుల ఆదేశానుసారం ఎన్నిక నిర్వహణ ఉంటుందని వెల్లడించారు. కాగా, ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు నేతృత్వంలో ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, ప్రొద్దుటూరు డీఎస్పీ భావన ఆధ్వర్యంలో ముందస్తు చర్యలను చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, వైసీపీ నాయకులు బంగారు మునిరెడ్డి, ఆయిల్‌మిల్ ఖాజా, టీడీపీ నాయకులు మురళీధర్‌రెడ్డి, బచ్చల పుల్లయ్యలను హౌస్ అరెస్టు చేశారు. ఎన్నిక సజావుగా సాగేందుకు కావాల్సిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టారు.

వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వమే శ్రేయస్కరం

- మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు

కడప రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వమే శ్రేయస్కరమని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్‌లు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో శుక్రవారం 5వ రోజు న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యవర్తిత్వంలో న్యాయవాదుల పాత్ర కీలకంగా ఉండాలన్నారు. శిక్షణలో రిసోర్స్‌పర్సన్ తెలియజేసిన అంశాలపై అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. వాటిని కక్షిదారులకు తెలియపరిచి కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే వెసులుబాటును కల్పించాలన్నారు. మధ్యవర్తిత్వం వలన సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. న్యాయపరమైన మధ్యవర్తుల కోసం నైతిక సూత్రాలు, డాక్యుమెంటరీ, ఇంటరాక్టివ్ సెషన్, మధ్యవర్తిత్వం, రాజీ నియమాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పద్ధతులు తదితర విషయాలను తెలియపరిచారు. ప్రాథమిక నియమాలు, వయోజన అభ్యాసం, మధ్యవర్తిత్వ శిక్షణ తదితర వాటి గురించి రిసోర్స్ పర్సన్స్ పీజీ సురేష్, జి.జ్యోతిలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ అనంతరం జడ్జిలతో కలిసి గ్రూప్ ఫొటోలో న్యాయవాదులు

సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ



చిన్నచౌకు పోలీసుస్టేషన్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

కడప క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో శుక్రవారం సాయంత్రం సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాలతో ఎస్ఐఎస్ డయల్ టీన్‌యాడ్స్ వారి ద్వారా సైబర్ క్రైం ఇన్‌స్పెక్టరు మధుమల్లేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ క్రైం, ఏఆర్ సిబ్బంది చిన్నచౌకు పోలీసుస్టేషన్ నుంచి వాహనాల్లో ర్యాలీ చేశారు. ఈ ర్యాలీ అప్సరసర్కిల్, వైజంక్షన్, డాక్టర్ అంబేడ్కర్ సర్కిల్ మీదుగా సాగింది. యాడ్స్ ఆన్ త్రీడీ ఫ్యాన్, త్రీడీ వాకర్స్ ద్వారా వీడియోల ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు.

లోన్‌యాప్, హనీట్రాప్, లాటరీల పేరుతో మోసాలు, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, రూ.10 లక్షలు పెట్టుబడి పెడితే 10 కోట్లు ఇస్తామని చెప్పడం తదితర మోసాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరం జరిగిన తక్షణమే 1930కి ఫోను ద్వారా తెలపాలన్నారు. కార్యక్రమంలో చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, సైబర్ క్రైం, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రం లీకేజీపై కేసులు నమోదు చేయాలి



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్ఎస్ఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి గణితం ప్రశ్నాపత్రం లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్న పత్రం లీకేజీ వ్యవహారంలో అసలు సూత్రదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం సిండికేట్ అయి వారి స్వలాభం కోసం ప్రశ్నపత్రాలు లీకేజీ చేసి ప్రభుత్వ ఉపాధ్యాయులపై నెట్టడం సరికాదన్నారు. ఇదంతా ప్రైవేటు పాఠశాలల ఒప్పందంతోనే జరిగిందని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంల ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్, కార్యదర్శి రెడ్డిసాయి, నాయకులు హరిక్రిష్ణ, సన్ని, హరి, షఫి, భార్గవ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పరిశోధన సంస్కృతి పెంపొందాలి : వీసీ

కడప ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో వినూత్న పరిశోధన సంస్కృతిని పెంపొందించాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు అల్లం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం వైవీయూలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. జాతీయ విద్యావిధానం 2020లో భాగంగా విద్యార్థుల సంపూర్ణ ప్రగతికి విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, వృక్ష శాస్త్రం, జంతు శాస్త్రం, బయోటెక్నాలజీ, గణిత శాఖలను సందర్శించారు. శాఖల వారీగా వారివారి విభాగాల అభివృద్ధిపై వివరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ విద్యార్థులు విశ్వవిద్యాలయం గురించి బయటిక వెళ్లిన తరువాత స్థానిక, గ్లోబల్ సమస్యలను పరిష్కరించేలా మనం తయారు చేయాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసరు పద్మ, డైరెక్టరు డాక్టర్ సుబ్రమణ్యంశర్మ పాల్గొన్నారు.

ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా ఇలియాస్‌బాషా

కడప ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ ఇలియాస్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఎన్నికల పరిశీలకులుగా ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మల్లు రఘునాథరెడ్డి హాజరయ్యారు. జిల్లా సెక్రటరీ జనరల్‌గా ఏపీటీఎఫ్ ఆర్.అబ్దుల్లా, ఆర్థిక కార్యదర్శిగా ఏపీటీఎఫ్ శ్రీనివాసులరెడ్డి ఎంపికయ్యారు. కో చైర్మన్‌లుగా జీవీ సుబ్బారెడ్డి, రామచంద్రబాబు, ఎం.జుబేర్ అహ్మద్, డిప్యూటీ సెక్రటరీలుగా ఎం.విజయకుమార్, వి.శ్యామలాదేవిలను ఎన్నుకున్నారు.

సైన్స్‌పరీక్షకు 99 శాతం మంది హాజరు

కడప ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి బయాలాజికల్ సైన్స్ పరీక్షకు 99 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు జీవశాస్త్రం పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 27723 మంది హాజరు కావాల్సి ఉండగా 27595 మంది (99శాతం) హాజరయ్యారు. 128 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులకు సంబంధించి 191 మందికి 79 మంది హాజరై 20 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 72 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్ 87 కేంద్రాలు, జిల్లా పరిశీలకులు డి.మధుసూదనరావు 7 కేంద్రాలు, జిల్లావిద్యాశాఖాధికారి మూడు కేంద్రాలను పరిశీలించారు.

60 శాతం అర్జీలు పరిష్కారం : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

కమలాపురం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల్లో 60శాతం అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించామని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పంచాయతీల వారీగా రివ్యూ నిర్వహించారు. ఏ పంచాయతీల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి.. ఎన్ని పరిష్కారమయ్యాయి.. పెండింగు ఎన్ని ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కడప రెవెన్యూ డివిజను పరిధిలో జరిగిన రెవెన్యూ సదస్సులో 4423 అర్జీలు వచ్చాయని, అందులో 60శాతం అర్జీలను తహసీల్దార్లు, క్షేత్ర స్థాయి సిబ్బందితో కలిసి సంతృప్తికరంగా పరిష్కరించామన్నారు. మిగిలినవి కోర్టు సమస్యలు, కుటుంబ తగాదాలున్నవి మాత్రమేనన్నారు. ముఖ్యంగా కమలాపురం ఏరియా మిగులు, ఇనాం భూములకు సంబంధించి 500 వరకు అర్జీలు వచ్చాయని, జేసీ సూచనల మేరకు ఎక్కువ శాతం పరిష్కరించామన్నారు. తహసీల్దారు శివరామిరెడ్డి, వీఆర్వోలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఎర్రబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఎన్ఎంయూ కడప డిపో నాయకులు

కడప మారుతీనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప రీజియన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ కడప డిపో అధ్యక్షుడు తొండలదిన్నె జయరాం కోరారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఆర్టీసీ రీజియన్ కమిటీ పిలుపు మేరకు ఎన్ఎంయూ నాయకులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ కడప డిపో కార్యదర్శి శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ పీఎస్‌ఖాన్, సంయుక్త కార్యదర్శి మూర్తి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆడిటింగ్ అధికారి అరెస్టు



ఆడిటర్‌ను తీసుకెళుతున్న కడప మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్ర జ్యోతి): భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడన్న కేసులో ప్రభుత్వ ఆడిట్ ఆఫీసర్ మధుకిరణ్‌రెడ్డిని పోలీసులు శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన భవనం వద్ద అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరులో అసిస్టెంట్ ఆడిటింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న మధుకిరణ్‌రెడ్డి రెండు రోజుల క్రితం డిప్యూటేషన్‌పై శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ఆడిటింగ్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈనెల 17న కడప మహిళా పోలీస్‌స్టేషన్‌లో మధుకిరణ్‌రెడ్డిపై ఆయన భార్య ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా కడప మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన భవనం వద్దకు చేరుకున్నారు. విధుల్లో ఉన్న అసిస్టెంట్ ఆడిటింగ్ అధికారి మధుకిరణ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని 1టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి కడప మహిళా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఏపీ రవీంద్ర



ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న రవీంద్ర

మైదుకూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ నేత అందె పాపయ్యగారి రవీంద్రను నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం 47 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్లను నియమిస్తూ అధికారికంగా జాబితాను విడుదల చేసింది. అందులో మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రవీంద్రను ఎంపిక చేశారు. శుక్రవారం ఆయన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చినందుకు శాలువ కప్పి పూలమాల వేసి సత్కరించారు.

లవణ కణాలు తగ్గకుండా జాగ్రత్త వహించండి



జాగ్రత్తలు తెలియజేస్తున్న సుబ్బరాయుడు

సిద్దవటం, మార్చి 28(ఆంధ్రజ్యోతి):ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు తగు జాగ్రత్తలు వహించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు అన్నారు. డ్రైడే ఫ్రైడే సందర్భంగా శుక్రవారం స్థానిక ముదిరాజ్ కాలనీలో పర్యటించారు. వడదెబ్బ నివారణకు గొడుగు వాడి కుం డలో నీరు తాగాలన్నారు. పి.కొత్తపల్లె, ప్రైమరీ హెల్త్‌సెంటర్ సూపర్ వైజర్ మౌలాలి, ఆరోగ్య కార్యకర్తలు లక్షుమ్మ, శారదా, ఆశావర్కర్, ఓబులమ్మ పాల్గొన్నారు.

వెదురు సాగు ఎంతో మేలు

ఓబులవారిపల్లె, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వెదురు సాగు ఎంతో మేలని ఏపీఎం మల్లికార్జునరాజు తెలిపారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సంఘం మహిళలకు, వీవోఏలకు వెదురు సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓబులవారిపల్లె మండలాన్ని ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద ఎన్నుకుందన్నారు. వెదురు సాగు ద్వారా మహిళలకు ఉపాధి కలుగుతుందన్నారు. రైల్వేకోడూరు ఏపీఎం వసుంధర, సీసీలు దామోదర్, గోవిందమ్మ, వెంకటసుబ్బమ్మ, హరిబాబు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేత

ఓబులవారిపల్లె, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రైల్వేకోడూరు మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చెన్నరాజుపోడు పంచాయతీలోని గాడివారిపల్లె దళితవాడలో మానవతా స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. దివ్యాంగ బాలిక కుంచం సంధ్య, వృద్ధురాలైన సుబ్బమ్మ, జి.వడ్డిపల్లెకు చెందిన కోళ్ల సుబ్బమ్మకు రూ.3 వేల చొప్పున అందించినట్లు చైర్మన్ కీర్తిపాటి ప్రసాద్‌వర్మ తెలిపారు.

రీసర్వేతో భూ సమస్యను పరిష్కరిద్దాం



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

సంబేపల్లె, మార్చి28(ఆంధ్రజ్యోతి): సమగ్ర రీసర్వేతో భూ సమస్యలను పరిష్కరిద్దామని తహసీల్దార్ సుబ్రమణ్యం రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్.సోమవారం గ్రామంలో జరుగుతున్న రీసర్వేలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు పొలాల గట్లను చూపించి రీసర్వే సిబ్బందికి అందుబాటులో ఉండి భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సర్వే నెంబర్ 45కు సంబంధించిన కొలతలను పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలను కూడా రీసర్వేతో పరిష్కరించుకోవచ్చునన్నారు. పక్కాగా రీసర్వే చేపట్టి భూవివాదాలను తావు లేకుండా చూడాలని డిపార్టుమెంట్ సిబ్బందికి తెలియజేశారు. మండల సర్వేయర్ హరికృష్ణ, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, విలేజ్ సర్వేయర్ రెడ్డిశేఖర్, రైతులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రాజ్‌కుమార్

లక్కిరెడ్డిపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా సుందరం రాజ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధే లక్ష్యమన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, గ్రూపులు ఉన్నాయని, సిలబస్ ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందన్నారు. ఈనెల 30 లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

దళిత ఉద్యోగిపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం

● వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు మణి



శ్యాంసుందర్‌తో చర్చిస్తున్న పండుగోల మణి

రైల్వేకోడూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దళిత ఉద్యోగి అయిన రైల్వేకోడూరు అటవీ శాఖ రేంజర్ శ్యాంసుదర్‌పై వచ్చిన వార్తలు అవాస్తవం అని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి తెలిపారు. శుక్రవారం ఆయన శ్యాంసుందర్‌తో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో కూడా గుర్తింపు లేని పీడీఎఫ్ పేపర్ల ట్యూబర్లు మామూళ్ల కోసం అధికారులను వేధింపులకు గురి చేశారన్నారు. మామూళ్లు ఇవ్వని పక్షంలో తమ పీడీఎఫ్ పేపర్లల్లో తప్పుడు రాతలు రాస్తున్నారని ఆరోపించారు. దళిత ఉద్యోగి కాబట్టి కొందరు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. అటవీశాఖ రేంజర్‌ను వివరణ కోరగా తనను కొందరు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారన్నారు.

ప్రేమ, పరోపకారానికి ప్రతీక రంజాన్

● టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రేమ, పరోపకారానికి ప్రతీక రంజాన్ పర్వదినం అని కుడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జామియా మసీద్‌లో టీడీపీ సీనియర్ నేత పఠాన్ మౌలా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈద్గా స్థలం సమస్యను త్వరలో పరిష్కరిస్తానన్నారు. అనంతరం జామియా కమిటీ సభ్యులు రూపానందరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు పఠాన్ మౌలా, జుబేర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



రామాపురం,మార్చి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్లూరు గ్రామం ఏకిలపల్లెలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. టీడీపీ రామాపురం మండల యువనాయకుడు గాలివీటి సురేంద్ర్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి, 48వ బూత్ ఇన్‌చార్జి తుమ్మల ఓబులేసు, క్లస్టర్ ఇన్‌చార్జి చింతపిచ్చల రామకృష్ణగౌడ్, టీడీపీ నాయకుడు దేవదర్శన్‌రెడ్డి, బసిరెడ్డి, నరసింహులు, గణేశ్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని నిరసన



రైల్వేకోడూరు రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని రైల్వేకోడూరులో ముస్లింలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా పిలుపు మేరకు పట్టణంలోని జామియా మసీద్ వద్ద ముస్లింలు ప్రార్థనలు చేసిన అనంతరం బిల్లు రద్దు చేయాలని నల్ల రిబ్బన్లు ధరించి నిరసన చేపట్టారు. రద్దు చేయకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జామియా మసీద్ కమిటీ అధ్యక్షుడు ముజీబ్, సభ్యులు పట్టాన్ మౌలా, టీడీపీ నాయకులు జుబేర్, మస్తాన్, వైసీపీ సీనియర్ నాయకులు అన్వర్ బాషా తదితరులుపాల్గొన్నారు.

'మా ప్రభుత్వంలో అక్రమాలకు తావులేదు'

రాయచోటిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వంలో అక్రమాలకు తావులేదని రాయచోటి మండల మాజీ ఉపాధ్యక్షుడు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల్లో వస్తున్న విశేష స్పందన చూపి ఓర్వలేని వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. తనపై బురదజల్లే ప్రయత్నంలో భాగంగా డాక్టర్ రెడ్డప్పరెడ్డికి సంబంధించిన భూమిని కూటమి నేతలు కబ్జా చేస్తున్నారంటూ తమపై సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు తప్పుడు ఆరోపణలు మానుకోకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

పాత కార్మికులను కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

రాజంపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులందరూ గత ప్రభుత్వంలో ఆక్వాస్ విధానంలో పనిచేశారు. అంఐతే ప్రస్తుత ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసి పాత కాంట్రాక్టర్ విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల కార్మికులందరూ తీవ్రంగా నష్టపోతారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులను తొలగించాలని ప్రభుత్వ నిర్ణయం సరికాదన్నారు. కార్మికులను తొలగిస్తే వారి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. కార్మికులపై తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని లేకపోతే ఉద్యమాలు చేపడతామన్నారు. మున్సిపల్ వర్కర్ యూనియన్ నేతలు పీవీ రమణ, లక్ష్మీదేవి, రాజంపేట డివిజన్ నాయకులు కె.ప్రసాద్, ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ ఆవిర్భావ వేడుకలకు పిలుపు'

సిద్దవటం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర తెలుగుదేశంపార్టీ ఆదేశాల మేరకు శనివారం తెలుగుదేశంపార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దవటం మండలంలోని 18 గ్రామ పంచాయతిల్లో పార్టీజెండా ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉదయం 9 గంటల్లోపు నిర్వహించాలని టీడీపీ మండల అధ్యక్షులు శనివారపు మోహన్‌రెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలోని అప్‌డేట్‌లను పార్టీ కార్యాలయానికి తెలియజేసేందుకు పంచాయతిలవారిగా ఫొటోలు తీసి 9603576162 నంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలని తెలియజేశారు. అనంతరం బాకరాపేటలోని టీడీపీ సీనియర్ నాయకులు కాడె శ్రీనివాసులునాయుడు ఇంటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో శనివారం ఉదయం 10 గంటలకు పార్టీ జెండా ఆవిష్కరణ జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పదాధికారులు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, పార్టీ అభిమానులు పాల్గొనాలని కోరారు.

నారా లోకేశ్‌ను కలిసిన సుగవాసి



రాయచోటిటౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి , విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ను గురువారం విజయవాడలో ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు, రాయచోటి నియోజకవర్గ నాయకుడు సుగవాసి ప్రసాద్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం: మంత్రి



ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, మార్చి28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత నిస్తోందని రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రజాసేవకే అంకితమయ్యారన్నారు. సమస్యల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.

ఆది, సోమవారాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు

పుల్లంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు సెలవు దినాలైన ఆదివారం, సోమవారం పుల్లంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ రఫి తెలిపారు. కావున భూములు, ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

10న ఆకలికేక పోరుబాట

ఓబులవారిపల్లె, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దళిత, గిరిజన, ముస్లిం మైనార్టీలకు గతంలో ఇచ్చిన పట్టా పాసుబుక్కులను ఆన్‌లైన్ చేసి భూమి సరిహద్దులు చూపించకపోతే తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏప్రిల్ 10 నుంచి ఆకలి కేక - పోరుబాట చేపడతామని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దారు శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ కార్యదర్శి ఎం. జయరామయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి నవమి ఉత్సవాలు

రామాపురం, మార్చి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠావుపేటలో వెలిసిన కోదండ రామాలయంలో ఆదివారం నుంచి ఉగాది పర్వదినం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఆర్యవైశ్య కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కాగా ఏప్రిల్ 6న ఆలయంలో మహాగణపతి పూజలు, స్వస్తివాచకం, పంచామృతాభిషేకాలు ఉంటాయన్నారు. అనంతరం ఉభయ దాతల పూజలు, స్వామి వారికి అలంకారాలు ఉంటాయన్నారు. అనంతరం అన్నదానం ఉంటుందన్నారు.

31నుంచి మంచాలమ్మ జాతర

రామాపురం,మార్చి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి పంచాయతీలో వెలిసిన మంచాలమ్మ జాతర ఈ నెల 31 సోమవారం, మైలు జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కొవ్వూరు వంశీకులు అమ్మవారికి విశేష పూజలు, అమ్మవారికి సారేతో పాటు పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తారు.

పశువులను కాపాడుకోవాలి

సుండుపల్లె, మార్చి28(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల పశువులను కాపాడుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీలో నాబార్డు సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాబు, వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ సభ

గాలివీడు, మార్చి28(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నేడు ఉదయం 10 గంటలకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్పీ, ఎస్ఎస్ఏటీ వారి ఆధ్వర్యంలో మార్చి 14 నుంచి 27వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందంచే నిర్వహించిన సామాజిక తనిఖీలో కనుగొన్న విషయాలను చర్చిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు, రైతులు, ఉ పాధి వేతనదారులు, ఉపాధి హామీ సి బ్బంది, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

చెత్తనుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన డీపీవో



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతి అధికారి

ఒంటిమిట్ట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : చెత్తనుండి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతి అధికారి రాజ్యలక్ష్మీ పరిశీలించారు. శుక్రవారం ఉదయం ఒంటిమిట్ట గ్రామ పంచాయతి నరవకాటిపల్లె దారిలో ఉన్న చెత్తనుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. తడిచెత్త, పొడిచెత్తలను వేరు చేయాలని తెలియజేశారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాలని అధికారులు ఉదయం టిఫిన్ అక్కడే తిన్నారు.ఈవోపీఆర్డీ ప్రసాద్, పంచాయతి కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

నిరుపేద ముస్లింలకు ఫిత్రా పంపిణీ

రైల్వేకోడూరు రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 150 మంది నిరుపేద ముస్లిం మహిళలకు ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున్న ఫిత్రా పంపిణీ చేసినట్లు అధ్యక్షుడు మస్తాన్ సాహెబ్ తెలిపారు. రంజాన్ మాసంలో ప్రతి ఏడాది నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ రేషన్ సరుకులతో పాటు ఫిత్రా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ముహ్మమద్ బాష, షేక్ షామీర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం.. ఒకరు అరెస్టు



పట్టుబడిన వ్యక్తితో ఎక్సైజ్ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వై.కోట క్రాస్ రోడ్డు వద్ద నాటుసారా అక్రమంగా తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసి ఐదు లీటర్లు సారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ వరుణ్‌కుమార్ తెలిపారు. ఓబులవారిపల్లి మండలం వై.కోట గ్రామానికి చెందిన తోట వెంకటసుబ్బయ్యను అరెస్టు చేసి అతని వద్ద నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు. నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ ఏఈని విచారించిన అటవీశాఖ అధికారులు



అటవీశాఖ కార్యాలయంలో ఏఈ

నందలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలోని భారత్ గ్యాస్ కార్యాలయం నుంచి నీలిపల్లెకు వెళ్లేదారిలో ఆర్అండ్‌బి పరిధిలో ఉన్న చెటను నరికించడంపై స్థానిక విద్యుత్ ఏఈ బాలసుబ్రమణ్యంను రాజంపేట అటవీశాఖ అధికారులు శుక్రవారం విచారించారు. విద్యుత్‌లైను ఏర్పాటుకు అడ్డంగా ఉన్నాయని ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లను విద్యుత్ సిబ్బంది తొలగించారు. అటవీశాఖ అధికారులు ఏఈని వి చారించినట్లు సమాచారం. అదేవిధంగా చెట్లను నరికివేయడంపై రోడ్ల భవనాలశాఖ ఏఈ కుమార్‌బాబు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్థానిక పోలీసులు విద్యుత్ ఏఈని విచారణకు రమ్మన్నట్లు సమాచారం.

పేదలకు సాయం అందించడం పుణ్యకార్యం



రంజాన్ తోఫా అందజేస్తున్న దృశ్యం

నందలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సాయం అందించడం పుణ్య కార్యమని మండల మైనార్టీ నాయకుడు షేక్ మౌలా, పఠాన్ మెహర్‌ఖాన్ అన్నారు. శుక్రవారం వారు మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని నందలూరు జిల్లా పరిషత్ క్రీడా మైదానం పరిసర ప్రాంతాల్లోని 15 మంది నిరుపేదలకు వారు రంజాన్ తోఫాను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే దా దాపు 60 కుటుంబాలకు పైగా పేదల ఇళ్లవద్దకు వెళ్లి సరకులు అందజేయడం జరిగిందన్నారు. పండుగ లోపుల మరిన్ని కుటుంబాలకు సహాయం అందజేస్తామన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి



ఓబులవారిపల్లె: భూసార పరీక్ష ఫలితాలను అందిస్తున్న ఏవో మల్లిక



రైల్వేకోడూరులో మాట్లాడుతున్న కవిత

రైల్వేకోడూరు రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో రైతులు పంటలు వేస్తే అధిక దిగుబడి లభిస్తుందని వ్యవసాయ సహయ సంచాలకులు కే.కవిత తెలిపారు. శుక్రవారం పట్టనంలో రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసార పరీక్షలతో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన వస్తుందని తెలిపారు. మండలంలోని 920 రైతులకు భూసార పరీక్షులు నిర్వహించి పంటలపై అవగాహన ఇవ్వడం ద్వారా అధిక దిగుబడి పొందారని తెలిపారు. అనంతరం మండల వ్యావసాయ అధికారి సుధాకర్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాలని, తద్వారా పలు ప్రయోజనాలు ఉన్నాయని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మండల పరిదిలోని చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రైతుసేవా కేంద్రంలో భూసార పరీక్ష ఫలితాలను రైతులకు అందజేయడం జరిగిందని ఏవో మల్లిక తెలిపారు. ఈ సందర్భంగా భూసార పరీక్షల వల్ల ఎరువుల వినియోగం ఎంత మేరకు ఉపయోగించాలో తెలుసుకోవడం జరుగుతుందని అలాప ఏ పంటలకు ఏయే ఎరువులు ఎంత మోతాదులో వినియోగించుకోవాలో సులువుగా తెలుసుకోవచ్చని రైతులకు వివరించారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: చమర్తి



టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజును పూలమాలతో సన్మానిస్తున్న టిడిపి నాయకులు

సుండుపల్లి, మార్చి28(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమయి టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు తెలిపారు. శుక్రవారం సుండుపల్లి మండలంలోని చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతి జంగంపల్లిలో అయన పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు అయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ పల్లెలో తాగునీటి సమస్య ఉందని, రోడ్లు లేవని, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రాజు గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారం దిశగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా జంగంపల్లిలో సమస్యలను వెంటనే పరిష్కరించేలా సమస్యను అధికారుల దృష్టికి తిసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు నాయకులు అయనతో మాట్లాడారు సుండుపల్లి, వీరబల్లి మండలాల నాయకులు పాల్గోన్నారు.

సుర్రుమంటున్న సూరీడు



- ప్రారంభంలోనే భానుడి ఉగ్రరూపం
- ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలాగో ?
- జాగ్రత్త పడకపోతే ప్రమాదం

పీలేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా మార్చిలో ప్రారంభమయ్యే వేసవి తీవ్రత ఏప్రిల్‌లో పుంజుకుని మేలో పతాకస్థాయికి వెళుతుంది. కానీ ఈ ఏడాది మాత్రం భానుడు మార్చి ఆరంభం నుంచే తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం 8 గంటల నుంచే తన తీవ్రతను ప్రదర్శిస్తూ మధ్యాహ్నానికి విశ్వరూపం చూపుతున్నాడు. మార్చిలోనే ఎండలు ఇలా మండిపోతుంటే ఇక ఏప్రిల్, మే మాసాల్లో ఎలా అని సామాన్యులు జడుసుకుంటు న్నారు. అయితే అనివార్యమైన ఈ ఉపద్రవాన్ని ఉపాయంతో ఎదుర్కోవాలని, తగిన జాగ్రత్తలు పాటిస్తే వేసవి నుంచి సురక్షితంగా బయటపడ వచ్చని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

హీట్ ఎగ్జాషన్....

ఎండ వేడికి తట్టుకోలేకపోవడం వల్ల తీవ్ర నీరసం, నిస్సత్తువ, నిస్త్రాణ (హీట్ ఎగ్జాషన్) తలెత్తుతుంది. దాని కారణంగా చెమట విపరీతంగా పట్టి శరీరం చల్లబడుతుంది. రక్తపోటు పడిపోతుంది. అప్పుడు దాహం, కళ్లు తిరగడం, బలహీనత, ఏకాగ్రత కుదరకపోవడం, వికారం, మత్తుగా అనిపించడం వంటి సమస్యలు ఏర్పడతాయి. కొందరు దీన్ని వడదెబ్బగానూ పొరపడుతుంటారు. వడదెబ్బలో చెమట పట్టదు. వేడి నిస్త్రాణలో చెమట పడుతుంది. శరీర ఉష్ణోగ్రత మామూలుగానే ఉంటుంది. తాకితే చర్మం చల్లగానూ అనిపిస్తుంది. వెంట్రుకలు నిక్కబొడుచుకుంటాయి. నాడి వేగం పెరగొచ్చు లేదా మామూలుగానైనా ఉండొచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బకు దారి తీసే ప్రమాదముంది. శిశు వులు, చిన్నపిల్లలు, వృద్ధులకు వేడి నిస్త్రాణ ముప్పు ఎక్కువ. ఊబకాయులు, వేడిని తట్టుకోలేని వారికీ దీనివల్ల ముప్పు ఉంటుంది. నీరసం, బడలికగా అనిపిస్తే వెంటనే చల్లటి ప్రదేశానికి వెళ్లాలి. నీరు ఎక్కువగా తాగాలి. అనంతరం డాక్టర్‌ను సంప్రదించాలి.

కండరాలు పట్టేయటం...

కండరాలు సజావుగా పనిచేయటానికి సోడియం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి లవణాలు అవసరం. శరీరంలో నీటి మోతాదు తగ్గిపోతే కండరాల పనితీరు అస్తవ్యస్తమై, బిగుసు కుపోవచ్చు. దీంతో విపరీతమైన నొప్పి పుడుతుంది. చాలా వరకు పిక్క కండరాలు పట్టేస్తుంటాయి. చేతులు, కడుపు కండరాలూ పట్టేయచ్చు. కాళ్లు, చేతులు కొంకర్లు పోవచ్చు కూడా. ఎండలో ఎక్కువ సేపు గడపడం, నడవటం, వ్యాయామం, పనులు చేయడం వంటివి కండరాలు పట్టేయటానికి కారణ మవుతుంటాయి. అధిక రక్తపోటు, మధుమేహం గలవారికీ దీని ముప్పు ఎక్కువే. కండరాలు పట్టేసి నప్పుడు చల్లటి ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవడం ముఖ్యం. చల్లటి నీరు, పానీయాలు తాగాలి. నీటిలో కాస్త ఉప్పు చక్కెర గానీ ఓఆర్ఎస్ పొడిని గానీ కలిపి తాగితే మంచిది. మజ్జిగలో ఉప్పు, నిమ్మరసం కలిపి అయినా తాగొచ్చు.



పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో సేద తీరుతున్న భవన నిర్మాణ కార్మికులు

సొమ్మసిల్లడం...

ఎండలోకి వెళ్లినప్పుడు ఉన్నట్లుండి సొమ్మసిల్లడం (హీట్ సింకోపీ) మరో సమస్య. దీనికి కారణం మెదడుకు తగినంత రక్తం అందక పోవడం. చెమట పట్టే క్రమంలో చర్మానికి రక్త సరఫరా పెరుగు తుంది. అదే సమయంలో మెదడుకు తగ్గుతుంది. ఇది మనుషులను సొమ్మసిల్లేలా చేస్తుంది. తల తిప్పటం, తలనొప్పి, వికారమూ ఉండచ్చు. ఎండను తట్టుకోలేని వారికి, వృద్ధులకు, రక్తపోటును తగ్గించే బీటా బ్లాకర్ల రకం మందులు వేసుకునే వారికి, ఇతర దీర్ఘకాల సమస్యలు గలవారికి ముప్పు ఎక్కువ. సొమ్మసిల్లటం తాత్కాలికమే అయినా జాగ్రత్త అవసరం. ఎండకు స్పృహ తప్పిన వారిని వెంటనే నీడకు చేర్చాలి. రక్తపోటు బాగా తగ్గినా, మరీ నీరసంగా ఉన్నా ఆసుపత్రికి చేర్చాలి.

వడదెబ్బ...

ఇది చాలా తీవ్రమైన సమస్య. చెమట పట్టే క్రమంలో రక్తంలోని ద్రవం బాగా ఆవిరి అవ్వొచ్చు. ఇదిలాగే కొనసాగితే ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ కుప్పకూలుతుంది. చివరికి చెమట పట్టడమూ ఆగిపోతుంది. ఇదే వడదెబ్బ. కొందరికి 106 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత పెరగొచ్చు. ఇందులో చర్మం పొడిబారుతుంది. ముట్టుకుంటే శరీరం కాలుతుంటుంది. నీరు, రక్తం పరిమాణం తగ్గటం వల్ల రక్తపోటూ పడిపోతుంది. రక్తం గడ్డకట్టే ప్రక్రియ కూడా అస్తవ్యస్తమవుతుంది. క్రమంగా అవయవాలు విఫలమై కోమాలోకి వెళ్లిపోవచ్చు. ఫిట్స్ రావొచ్చు. పరిస్థితి మరీ విషమించి ప్రాణాపాయమూ సంభవించొచ్చు. చాలామంది ఎండలోకి వెళితేనే వడదెబ్బ తగులుతుందని భావిస్తుంటారు. కానీ వేడి గాలి, వేడి వాతావరణం ప్రభావంతో ఇంట్లో ఉన్నా వడదెబ్బ తగలవచ్చు.

చల్లబరచటం ప్రధానం

వడదెబ్బ తగిలిన వారి శరీరం చల్లబడేలా చూడడం ప్రధానం. ఎండలో ఉంటే వెంటనే నీడకు చేర్చాలి. బిగుతైన దుస్తులు, టెర్లిన్, పాలిస్టర్ దుస్తులు ధరిస్తే తొలగించాలి. వదులైన, కాటన్ దుస్తులు వేయాలి. గాలి బాగా ఆడేలా చూడాలి. తడి గుడ్డతో ఒళ్లంతా తుడవాలి. శరీరం మీద నీళ్లు గుమ్మరించి ఫ్యాను గాలి తగిలేలా చూడాలి. ఐస్ ముక్కలను ప్లాస్టిక్ బ్యాగులో వేసి ఒళ్లంతా అద్దాలి. వడదెబ్బ చాలా త్వరగా ప్రాణాపాయానికి దారి తీస్తుంది. కాబట్టి సత్వర చికిత్స అవసరం. ఆసుపత్రిలో ఐస్ బాత్, సెలైన్ ఎక్కించడం వంటి వాటి ద్వారా ఉష్ణోగ్రత తగ్గేలా చేస్తారు.

ముప్పు ఎవరికి...

చిన్నపిల్లలు, వృద్ధులకు దాహం వేసే విషయం అంతగా తెలియదు. దీంతో నీరు తగినంతగా తాగరు. స్వేదగ్రంథులు తక్కువగా ఉండడం వల్ల చెమట అంతగా పట్టదు. వయసు మీద పడ్డ వారిలో చాలామంది అధిక రక్తపోటు వంటి సమస్యలకు మందులు వేసుకుంటుంటారు కూడా. వీటితోనూ వడదెబ్బ ముప్పు పెరగొచ్చు.



నిర్మానుష్యంగా ఉన్న పీలేరు పాతబస్టాండు

ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి

- డాక్టర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, పీలేరు



వేసవిలో వచ్చే సమస్యలను అధిగమించాలంటే ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. నిమ్మరసం కలిపిన మజ్జిగ, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, దోసకాయలు, పుచ్చకాయలు, చీనీకాయలు, దానిమ్మ వంటి పండ్లు తీసుకోవాలి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్యలో వృద్ధులు, చిన్నపిల్లలు బయటకు వెళ్లకపోతేనే మంచిది. వ్యాయామాలు కూడా ఉదయం 8 గంటలలోపు ముగించాలి. వేసవిలో మద్యపానం, మసాలా పదార్థాల జోలికి వెళ్లకపోవడం మంచిది.

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న పీడీ ఆదిశేషారెడ్డి

సిద్దవటం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న తోటల పెంపకం, గోకులం షెడ్ల పనులను ఉపాధి పీడీ ఆదిశేషారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని శాఖరాజుపల్లె, ఉప్పరపల్లె, చాముండేశ్వరిపేటల్లో ఆయన పర్యటించారు. ఉపాధిహామీ నిధులతో సాగు చేస్తున్న ఫైర్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. శాఖరాజుపల్లెలో గోకులం షెడ్డు నిర్మాణాన్ని, ఉప్పరపలెలో ఫారంపాండ్ పనులను పరిశీలించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని కూలీలు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు మాత్రమే పనులు చేయాలని, కూలి మొత్తం పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నరసింహులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రేపటి నుంచి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

నందలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : స్మాషర్స్ షటిల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈనెల 30, 31 తేదీల్లో అన్నమయ్య, కడప జిల్లా స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్, నాన్ మెడలిస్ట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నందలూరు రైల్వే కేంద్రంలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో టోర్నమెంట్ నిర్వహించనున్నామని, ఔత్సాహిక క్రీడాకారులు ఈనెల 29వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి 7 వేలు, రెండో బహుమతి 5 వేలు, మూడో బహుమతి 3 వేలు, నాలుగో బహుమతి 2 వేలతోపాటు షీల్డ్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతిఒక్కరికి మెడల్స్ ఇస్తామని, ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్మాషర్స్ షటిల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వేసవిలో లేగదూడలను సంరక్షించుకోవాలి



వెలిగల్లులో లేగ దూడల ప్రదర్శనలో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై

పెద్దమండ్యం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వేసవిలో లేగ దూడలను సంరక్షించుకోవాలని పాడి రైతులకు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై పిలుపునిచ్చారు. మండలంలోని వెలిగల్లులో రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవులకు పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లేగ దూడల జాతి లక్షణాలు, శరీర బరువు, యాజమాన్య పద్ధతులు వివరించారు. దూడల బరువును వాటి ఆరోగ్య పరిస్థితిని గుర్తించాలన్నారు. మేలు జాతి లేగ దూడల సంరక్షణ పద్ధతులు అవలంబించిన రైతులకు ప్రోత్సాహక బహుమతులును అందజేశారు. వేసవిలో పచ్చి గడ్డి మేతకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బాలసుబ్రమణ్యం, మదనపల్లి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ సుమిత్ర, పెద్దమండ్యం, తంబళపల్లి పశు వైద్యాధికారులు విక్రమ్‌రెడ్డి, ఉస్మాన్, సుజన, సర్పంచ్ సరస్వతి, రైతులు పాల్గొన్నారు.

ఐదు ఎక్స్‌కవేటర్లు సీజ్



సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్లు

వాల్మీకిపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్న ఐదు ఎక్స్ కవేటర్లను శుక్రవారం పోలీసు, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. వాల్మీకిపురం పట్టణానికి భోగంపల్లె రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా జరుగుతోందని, అక్క ఇసుక తవ్వకాలను ఉపేక్షించేది లేదంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయినా శుక్రవారం వేకువన కొందరు ఇసుక తరలిస్తున్నట్లు ఫిర్యాదులందాయి. దీంతో దాడులు నిర్వహించి ఇసుక తవ్వుతున్న 5 ఎక్స్‌కవేటర్లు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఒంటరి మహిళపై దాడి

- ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్న బాధితులు



చికిత్స పొందుతున్న లక్ష్మి

పెద్దతిప్పసముద్రం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ కోసం కిరాణా దుకాణం నడుపుకుంటున్న ఒంటరి మహిళపై కొందరు వ్యక్తులు దాడి చేసి గాయపర్చిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. కాట్నగల్లు హరిజనవాడకు చెందిన పెద్దకొండిగాళ్ల సూరప్ప కూతురు లక్ష్మి భర్త చనిపోవడంతో పుట్టింట్లోనే ఉంటోంది. కుటుంబాన్ని పోషించుకునేందుకు తన ఇంటి పక్కనే ఉన్న ఖాళీ జాగా ఓ బంకు ఏర్పాటు చేసుకుంది. ఆ బంకు తమ స్థలంలో ఉందంటూ ఈ నెల 23 సాయంత్రం ఇదే గ్రామానికి చెందిన కొమ్ము వెంకట్రమణ తన కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మి అమె కుటుంబ సభ్యులతో గొడవపడి, దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన కూతురిని మదనపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సూరప్ప తెలిపాడు. గంగజాతర బందోబస్తులో ఉన్నామని జాతర అయిపోగానే ఇరువర్గాలను పిలిపించి న్యాయం చేస్తామని ఎస్ఐ తెలిపారని, దాడి జరిగి నాలుగు రోజులు అవుతున్నా కనీస చర్యలు తీసుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



రామాంజనేయులు (ఫైల్ ఫొటో)

రాజంపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పుల్లంపేట మండలం బావికాడపల్లెకు చెందిన ఫొటో స్టూడియో యజమాని రామాంజనేయులు (29)గా గుర్తించారు. అ ప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కొందరు, వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్లు మరికొందరు చెబు తున్నారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెట్టుకు ఉరి వేసుకొని పూజారి ఆత్మహత్య

బి.కొత్తకోట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ పూజారి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని బడికాయలపల్లె బీసీ కాలనీకి చెందిన తలారి కృష్ణప్ప(58) అదే గ్రామంలోని ఈరమద్దెమ్మ గుడికి పూజారిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఓ చింతమానుకు ఉరి వేసుకున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు వున్నారు. కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కొడుకు వీరభద్ర పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు సీఐ జీవన్‌గంగానాథ్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వివాదాస్పద భూమి పరిశీలన



బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

రామసముద్రం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం ఎర్రనేలపల్లెలోని వివాదాస్పద భూమిని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ శుక్రవారం పరిశీలించారు. సర్వే నెంబర్ 218/1సీ లోని 2.75 సెంట్ల ప్రభుత్వ భూమి విషయంలో ఆరునెలలుగా లక్ష్మమ్మ, పార్వతమ్మల మధ్య వివాదం నెలకొంది. ఈ విషయంపై లక్ష్మమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ వివాదాస్పద భూమిని పరిశీలించారు. రామసముద్రం తహసీల్దార్ నిర్మలాదేవి, డివిజనల్, సర్వేయర్ దిలీప్‌కుమార్ సమక్షంలో సర్వే చేసి బాధిత మహిళ లక్ష్మమ్మకు స్వాధీనం చేశారు. అయితే పార్వతమ్మ ఇందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొన్నేళ్లుగా ఈ భూమి తన అనుభవంలో ఉందని, ఈ భూమి లేకపోతే ఎలా బతకాలని సబ్‌కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఈ భూమికి బదులుగా వేరొక చోట భూమి ఇస్తామని చెప్పారు. అనంతరం మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీలో భూ రీసర్వేను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. అరికెల పంచాయతీ చిట్టెంవారిపల్లెలో దారి విషయంలో గ్రామస్థుల మధ్య నెలకొన్న వివాదంపై మాట్లాడి ఇరువర్గాలకు ఆమోదయోగ్యంగా సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తామని తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట

- పురుషులకు డ్వాక్రా తరహా సంఘాలు
- మెప్మా పీడీ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

మదనపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మెప్మా పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, రీసోర్స్ పర్సన్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ..మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా కొత్త పథకాలను తీసుకొస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలని, పది మందికి తక్కువగా ఉన్న గ్రూపుల్లో కొత్త వారిని చేర్చాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన పురుషులు, చేతివృత్తిదారులకు సంఘాలు ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాలని సూచించారు. పురుషుల సంఘాలకు తమ వృత్తిలో నైపుణ్యాలు పెంచుకునే విధంగా రుణాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ముఖ్యంగా. పేద, మధ్య తరగతి ప్రజలు, పలు రంగాల్లో పనిచేసే కార్మికులను గ్రూపుల్లో చేర్చడం ద్వారా ఆర్థికంగా పురోగతి సాధించాలని సంఘ సభ్యులు, ఆర్పీలకు సూచించారు. అనంతరం మహిళల ఆరోగ్యం, సమాజంలో వారి పాత్ర, నడవడిక, కుటుంబ ఆరోగ్యం, పిల్లల పెంపకం, తదితర వ్యక్తిగత, సామాజిక అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమీషనర్ కే.ప్రమీల, సీఎంఎం మధుసూధన్‌రెడ్డి, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లెలో చోరీ



దుండగులు పగులగొట్టిన బీరువా

సిద్దవటం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లె సాయినగర్‌లో నివాసం ఉన్న రఘురామయ్య గృహంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి కథనం మేరకు రఘురామయ్య భార్య లీలావతి 10 రోజులుగా హైదరాబాదులోని తన కుమారుల సాయంతో అక్కడి అంకుర ఆస్పత్రిలో చికిత్స పొందు తోంది. మార్చి 26న బుధవారం రాత్రి రఘురామయ్య భార్యను చూసేందుకు హైదరాబాదుకు వెళ్లాడు. ఆ సమ యంలో గుర్తు తెలియని వ్యక్తులు తన ఇంట్లో చోరీ చేశారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీరువాలో దాచిన రూ.45 వేల నగదు, నాలుగు జతల కమ్మలు, ఒక చైను తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో పోలీ సులు క్లూస్ టీం సాయంతో సంఘటన స్థలంలో తనిఖీ చేశా రు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

జాబ్ మేళాతో ఉద్యోగ కల్పన

తంబళ్లపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు పొందడానికి జాబ్ మేళా చక్కటి వేదికని ప్రభుత్వ ఐటీఐ టీవో నాగరాజు అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివిన యువత హాజరయ్యారు. వీరికి ముత్తూట్ ఫైనాన్స్, హ్యూండయ్ మొబైల్ కంపెనీ ప్రతినిధులు కళ్యాణ్, రవితేజ ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ చూపిన ఏడుగురిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా టీవో మాట్లాడుతూ..నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య, ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లు సురేంద్ర, రమణ, అశోక్, యువత పాల్గొన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని ఈ సందర్భంగా నిర్వాహకులు అభినందించారు.

ఉగాది సందర్భంగా కవులకు సత్కారం



కవులను సత్కరించిన ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్

రాజంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగను పురస్కరించుకుని అన్నమయ్య జిల్లాలోని పలువురు కవులను శుక్రవారం నెల్లూరుకు చెందిన కేంద్ర ప్రభుత్వ ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వారు ఘనంగా సత్కరించారు. నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజంపేట తెలుగు పండితులు, కవి, రచయిత గంగనపల్లి వెంకటరమణ , ఉపాధ్యాయుడు, ప్రముఖ ఇంద్రజాలికుడు యూపీ రాయుడు, చిట్వేలికి చెందిన కవి, ఉపాధ్యాయులు దొండ్లవాగు శ్రీనివాసులు, తాళ్లపాక గ్రామానికి చెందిన కవి బాలరాజు జనార్దన్‌రాజు సన్మానం అందుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఉగాది లక్ష్మికి స్వాగతం, శుభ స్వాగతం పేరిట గంగనపల్లె వెంకటరమణ, ఓ మనిషీ.. ఇక మిగిలేదేముంది.. చెప్పేదేముందంటూ యూపీ రాయుడు గేయ కవిత, ఒక్క వాన పేరుతో చిట్వేలికి చెందిన ఉపాధ్యాయుడు దొండ్లవాగు శ్రీనివాస్, ఉగాది ఆకాంక్షల పేరుతో బాలరాజు జనార్దన్‌రాజు ఆలపించిన కవితలు అలరించాయి.

అలరించిన అన్నమయ్య సంకీర్తనల ఆలాపన



సంకీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు

రాజంపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పదకవితా పితామహుడు తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమాచార్యుల 522వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సంగీతసభ , హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. రాజంపేట మండలం మండలం తాళ్లపాక ఆర్చి అన్నమయ్య ఉద్యానవనంలోని అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు కె.సుబ్రమణ్యం, సి.దేవికాబృందం, సంగీత సభ నిర్వహించారు. జీఎన్‌కే సీతాలక్ష్మీ బృందం హరికథ కాలక్షేపం నిర్వహించారు.

నిత్యపూజ ఆలయ హుండీలోని కానుకల లెక్కింపు



హుండీలోని కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

సిద్దవటం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిత్యపూజ ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 27 నుంచి మార్చి 28 వరకు హుండీలోని కానుకలు లెక్కించగా రూ. 72,470 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనార్దన్, హెడ్‌కానిస్టేబుల్ రమణ, ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు సిబ్బంది, ఫీల్డ్ ఆఫీసర్ సురేంద్రబాబు, మెసెంజర్ సతీష్, జ్యోతి, వెంకటసుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, అర్చకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మునిగోపాల్ కృష్ణకు డాక్టరేట్



డాక్టరేట్ పట్టాతో మునిగోపాలకృష్ణ

మదనపల్లె అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఢిల్లీ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డే స్ప్రింక్ ఇంటర్‌నేషనల్ యూనివర్సిటీ వారు ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడుమునిగోపాల్‌కృష్ణకు శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. హైదరాబాదులో బిర్లా ప్లానిటోరియం ఆడిటోరియంలో ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మునిగోపాల్ కృష్ణ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సమస్యలపై తన భార్య ధనలక్ష్మి నిర్మాణంలో కనువిప్పు, ఆవేదన లఘుచిత్రాలు తీశానన్నారు . కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి, జనరల్ సెక్రటరీ రామచంద్రరావు, మో తుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



పగడాల చంద్రకుమార్, ఇన్‌సెట్‌లో చంద్రకుమార్ (ఫైల్)

బద్వేలుటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక పురుగుల మందు తాగి శుక్రవారం పగడాల చంద్రకుమార్ (36) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని పెద్దఅగ్రహారంలో నివాసం ఉండే చంద్రకుమార్ అప్పులు ఎక్కువ చేశాడు. ఈ నేపథ్యంలో అప్పులు ఇచ్చిన వారి నుంచి వేధింపులు పెరగడంతో.. ఆ బాధను భరించలేక బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోయి శుక్రవారం పట్టణంలోని నెల్లూరురోడ్డులో ఉన్న ఓ లాడ్జిలో పురుగులమందు తాగి మృతి చెందాడు. మృతుడు ఉన్న గది నుంచి దుర్వాసన రావడంతో అక్కడ పనిచేసే సిబ్బంది వెళ్లిచూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, మృతుడు చంద్రకుమార్‌కు అదే గ్రామానికి సుమతితో వివాహమైంది. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీ.. వృద్ధురాలు మృతి



కడప క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఉక్కాయపల్లె సమీపంలోని బైపాస్ రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు కడప ట్రాఫిక్ సీఐ జావీద్ తెలిపారు. గురువారం రాత్రి నడుచుకుంటూ వెళుతున్న ఆమెను వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడి కక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతి చెందిన వృద్ధురాలికి 65 సంవత్సరాలు ఉంటుందని, ఇతర వివరాల కోసం 9121100539 లేదా కడప ట్రాఫిక్ పోలీసుస్టేషన్ వచ్చి తెలుసుకోవాలని సీఐ తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



రాజశేఖర్ మృతదేహం

కడప క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామరాజుపల్లెలోని ఎస్సీ కాలనీకి చెందిన రాజశేఖర్ (24) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాలుకా సీఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. రాజశేఖర్ డిగ్రీ బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గత ఏడాది నుంచి కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. కడుపు నొప్పి తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

గోపవరం ఉపసర్పంచ్ ఎన్నికకు బ్రేక్

- ఎన్నిక నిర్వహణాధికారికి అస్వస్థత
- వాయిదా వేసిన అధికారులు





వార్డు మెంబర్లను తనిఖీ చేసి ఎన్నికల కేంద్రంలోకి పంపుతున్న పోలీసులు, అస్వస్థతకు గురైన రామాంజనేయులరెడ్డిని ఆస్పత్రికి తరలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా గురువారం చోటు చేసుకున్న హింసాత్మక ఘటన నేపథ్యంలో కోరం లేకపోవడంతో అధికారులు వాయిదా వేసిన విషయం తెలిసిందే. శుక్రవారం చేపట్టిన ఎన్నికకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి వార్డు మెంబరును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఒక్కొక్కరిని ఎన్నిక కేంద్రంలోకి అనుమతించారు. ఉదయం 11 గంటల నుంచి ఈ ఎన్నిక ప్రక్రియ మొదలైంది. జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ప్రొద్దుటూరు తహసీల్దారు గంగయ్య ఎన్నిక సరళిని పరిశీలించారు. కాగా, ఎన్నిక కేంద్రంలో వార్డు సభ్యుల మధ్య గతంలో కుదుర్చుకున్న ఒప్పంద వ్యవహారమై వాగ్వాదం చోటు చేసుకుంది. బీసీ అభ్యర్థిని ఉపసర్పంచుగా ఎన్నుకోకపోవడానికి కారణం మీరంటే మీరని ఒకరిపై ఒకరు ఆరోపిస్తూ వాగ్వాదానికి దిగడంతో కొంత ఘర్షణ వాతవాతరణం నెలకొంది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణ అధికారి, ఈవోపీఆర్‌డీ రామాంజనేయులరెడ్డి అస్వస్థతకు లోనయ్యారు. ఛాతినొప్పి రావడంతో హుటాహుటిన ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ పరిణామాలను జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో వారి ఆదేశాల మేరకు ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు గోపవరం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ అధికారికంగా ప్రకటించారు. కలెక్టర్ తదుపరి ఉత్తర్వుల ఆదేశానుసారం ఎన్నిక నిర్వహణ ఉంటుందని వెల్లడించారు. కాగా, ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు నేతృత్వంలో ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, ప్రొద్దుటూరు డీఎస్పీ భావన ఆధ్వర్యంలో ముందస్తు చర్యలను చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, వైసీపీ నాయకులు బంగారు మునిరెడ్డి, ఆయిల్‌మిల్ ఖాజా, టీడీపీ నాయకులు మురళీధర్‌రెడ్డి, బచ్చల పుల్లయ్యలను హౌస్ అరెస్టు చేశారు. ఎన్నిక సజావుగా సాగేందుకు కావాల్సిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టారు.

వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వమే శ్రేయస్కరం

- మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు

కడప రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వమే శ్రేయస్కరమని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్‌లు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో శుక్రవారం 5వ రోజు న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యవర్తిత్వంలో న్యాయవాదుల పాత్ర కీలకంగా ఉండాలన్నారు. శిక్షణలో రిసోర్సుపర్సన్ తెలియజేసిన అంశాలపై అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. వాటిని కక్షిదారులకు తెలియపరిచి కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే వెసులుబాటును కల్పించాలన్నారు. మధ్యవర్తిత్వం వలన సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. న్యాయపరమైన మధ్యవర్తుల కోసం నైతిక సూత్రాలు, డాక్యుమెంటరీ, ఇంటరాక్టివ్ సెషన్, మధ్యవర్తిత్వం, రాజీ నియమాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పద్ధతులు తదితర విషయాలను తెలియపరిచారు. ప్రాథమిక నియమాలు, వయోజన అభ్యాసం, మధ్యవర్తిత్వ శిక్షణ తదితర వాటి గురించి రిసోర్స్ పర్సన్స్ పీజీ సురేష్, జి.జ్యోతిలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ అనంతరం జడ్జిలతో కలిసి గ్రూప్ ఫొటోలో న్యాయవాదులు

సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ



చిన్నచౌకు పోలీసుస్టేషన్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

కడప క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో శుక్రవారం సాయంత్రం సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాలతో ఎస్ఐఎస్ డయల్ టీన్‌యాడ్స్ వారి ద్వారా సైబర్ క్రైం ఇన్‌స్పెక్టరు మధుమల్లేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ క్రైం, ఏఆర్ సిబ్బంది చిన్నచౌకు పోలీసుస్టేషన్ నుంచి వాహనాల్లో ర్యాలీ చేశారు. ఈ ర్యాలీ అప్సరసర్కిల్, వైజంక్షన్, డాక్టర్ అంబేడ్కర్ సర్కిల్ మీదుగా సాగింది. యాడ్స్ ఆన్ త్రీడీ ఫ్యాన్, త్రీడీ వాకర్స్ ద్వారా వీడియోల ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు.

లోక్‌యాప్, హనీట్రాప్, లాటరీల పేరుతో మోసాలు, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, రూ.10 లక్షలు పెట్టుబడి పెడితే 10 కోట్లు ఇస్తామని చెప్పడం తదితర మోసాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరం జరిగిన తక్షణమే 1930కి ఫోను ద్వారా తెలపాలన్నారు. కార్యక్రమంలో చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, సైబర్ క్రైం, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రం లీకేజీపై కేసులు నమోదు చేయాలి



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్ఎస్ఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి గణితం ప్రశ్నాపత్రం లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్న పత్రం లీకేజీ వ్యవహారంలో అసలు సూత్రదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం సిండికేట్ అయి వారి స్వలాభం కోసం ప్రశ్నపత్రాలు లీకేజీ చేసి ప్రభుత్వ ఉపాధ్యాయులపై నెట్టడం సరికాదన్నారు. ఇదంతా ప్రైవేటు పాఠశాలల ఒప్పందంతోనే జరిగిందని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంల ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్, కార్యదర్శి రెడ్డిసాయి, నాయకులు హరిక్రిష్ణ, సన్ని, హరి, షఫి, భార్గవ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పరిశోధన సంస్కృతి పెంపొందాలి : వీసీ

కడప ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో వినూత్న పరిశోధన సంస్కృతిని పెంపొందించాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు అల్లం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం వైవీయూలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. జాతీయ విద్యావిధానం 2020లో భాగంగా విద్యార్థుల సంపూర్ణ ప్రగతికి విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, వృక్ష శాస్త్రం, జంతు శాస్త్రం, బయోటెక్నాలజీ, గణిత శాఖలను సందర్శించారు. శాఖల వారీగా వారివారి విభాగాల అభివృద్ధిపై వివరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ విద్యార్థులు విశ్వవిద్యాలయం గురించి బయటిక వెళ్లిన తరువాత స్థానిక, గ్లోబల్ సమస్యలను పరిష్కరించేలా మనం తయారు చేయాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాధరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసరు పద్మ, డైరెక్టరు డాక్టర్ సుబ్రమణ్యంశర్మ పాల్గొన్నారు.

ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా ఇలియాస్‌బాషా

కడప ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ ఇలియాస్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఎన్నికల పరిశీలకులుగా ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మల్లు రఘునాధరెడ్డి హాజరయ్యారు. జిల్లా సెక్రటరీ జనరల్‌గా ఏపీటీఎఫ్ ఆర్.అబ్దుల్లా, ఆర్థిక కార్యదర్శిగా ఏపీటీఎఫ్ శ్రీనివాసులరెడ్డి ఎంపికయ్యారు. కో చైర్మన్‌లుగా జీవీ సుబ్బారెడ్డి, రామచంద్రబాబు, ఎం.జుబేర్ అహ్మద్, డిప్యూటీ సెక్రటరీలుగా ఎం.విజయకుమార్, వి.శ్యామలాదేవిలను ఎన్నుకున్నారు.

సైన్స్‌పరీక్షకు 99 శాతం మంది హాజరు

కడప ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి బయాలాజికల్ సైన్స్ పరీక్షకు 99 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు జీవశాస్త్రం పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 27723 మంది హాజరు కావాల్సి ఉండగా 27595 మంది (99శాతం) హాజరయ్యారు. 128 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులకు సంబంధించి 191 మందికి 79 మంది హాజరై 20 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 72 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్ 87 కేంద్రాలు, జిల్లా పరిశీలకులు డి.మధుసూదనరావు 7 కేంద్రాలు, జిల్లావిద్యాశాఖాధికారి మూడు కేంద్రాలను పరిశీలించారు.

60 శాతం అర్జీలు పరిష్కారం : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

కమలాపురం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల్లో 60శాతం అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించామని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పంచాయతీల వారీగా రివ్యూ నిర్వహించారు. ఏ పంచాయతీల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి.. ఎన్ని పరిష్కారమయ్యాయి.. పెండింగు ఎన్ని ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కడప రెవెన్యూ డివిజను పరిధిలో జరిగిన రెవెన్యూ సదస్సులో 4423 అర్జీలు వచ్చాయని, అందులో 60శాతం అర్జీలను తహసీల్దార్లు, క్షేత్ర స్థాయి సిబ్బందితో కలిసి సంతృప్తికరంగా పరిష్క రించామన్నారు. మిగిలినవి కోర్టు సమస్యలు, కుటుంబ తగాదాలున్నవి మాత్రమేనన్నారు. ముఖ్యంగా కమలాపురం ఏరియా మిగులు, ఇనాం భూములకు సంబంధించి 500 వరకు అర్జీలు వచ్చాయని, జేసీ సూచనల మేరకు ఎక్కువ శాతం పరిష్కరించామన్నారు. తహసీల్దారు శివరామిరెడ్డి, వీఆర్వోలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఎర్రబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఎన్ఎంయూ కడప డిపో నాయకులు

కడప మారుతీనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప రీజియన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ కడప డిపో అధ్యక్షుడు తొండలదిన్నె జయరాం కోరారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఆర్టీసీ రీజియన్ కమిటీ పిలుపు మేరకు ఎన్ఎంయూ నాయకులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ కడప డిపో కార్యదర్శి శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ పీఎస్‌ఖాన్, సంయుక్త కార్యదర్శి మూర్తి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం

- గ్రీవెన్స్‌డేలో ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి ఎస్పీకి స్వయంగా విన్నవించారు. సీ సిబ్బంది సమస్యలు విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని ఎస్పీ అశోక్‌కుమార్ సిబ్బందికి భరోసా ఇచ్చారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

హత్యాయత్నం కేసులో ఆడిటింగ్ అధికారి అరెస్టు



ఆడిటర్‌ను తీసుకెళుతున్న కడప మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడన్న కేసులో ప్రభుత్వ ఆడిట్ ఆఫీసర్ మధుకిరణ్‌రెడ్డిని పోలీసులు శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన భవనం వద్ద అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరులో అసిస్టెంట్ ఆడిటింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న మధుకిరణ్‌రెడ్డి రెండు రోజుల క్రితం డిప్యూటేషన్‌పై శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ఆడిటింగ్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈనెల 17న కడప మహిళా పోలీస్‌స్టేషన్‌లో మధుకిరణ్‌రెడ్డిపై ఆయన భార్య ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా కడప మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన భవనం వద్దకు చేరుకున్నారు. విధుల్లో ఉన్న అసిస్టెంట్ ఆడిటింగ్ అధికారి మధుకిరణ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని 1టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి కడప మహిళా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఏపీ రవీంద్ర



ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న రవీంద్ర

మైదుకూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ నేత అందె పాపయ్యగారి రవీంద్రను నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం 47 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్లను నియమిస్తూ అధికారికంగా జాబితాను విడుదల చేసింది. అందులో మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రవీంద్రను ఎంపిక చేశారు. శుక్రవారం ఆయన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చినందుకు శాలువ కప్పి పూలమాల వేసి సత్కరించారు.

'పది' పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

పెద్దమండ్యం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యంలోని పదవ తరగతి పరీక్ష కేందాన్ని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ శనివారం తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును సంబంధితాధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష గదులలో విద్యుత్తు సౌకర్యం, వైద్య సౌకర్యాలను పరిశీలించారు. బయాలజీ విభాగంలో 184 మంది విద్యార్థులకు గానూ 177 మంది హజరైనట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు.

రూ.17.91 లక్షల ఆదాయం

గుర్రంకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పంచాయతీకి వేలం పాటల ద్వారా రూ.17.91 లక్షల ఆదాయం వచ్చినట్లు డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు తెలిపారు. గుర్రంకొండ వారపు సంత, బస్టాండు గేట్‌కు శుక్రవారం వేలం పాటను నిర్వహించారు. ఈ సందర్భంగా వారపు సంతను సి.రమణారెడ్డి రూ.14,31,000 లక్షలకు, బస్టాండును కే.విజయ్‌కుమార్ రూ.3,60,000 లక్షలకు దక్కించుకొన్నట్లు తెలిపారు.

తరిగొండలో..

మండలంలోని తరిగొండ పంచాయతీలో వారపు సంతకు శుక్రవారం వేలం పాటను నిర్వహించారు. ఇందులో భాగంగా వారపు సంతను హుస్సేన్‌సాహెబ్ రూ.2,95,000 వేలం పాటలో దక్కించుకున్నట్లు డీఎల్పీవో తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బ్రహ్మానంద రెడ్డి, కార్యదర్శులు శ్రీహరి, విశ్వనాథ్, నిస్సార్ అహ్మద్, సంధ్యారాణి, సర్పంచ్ వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు



రాష్ట్ర మంత్రితో జయచంద్రారెడ్డి, తదితరులు

తంబళ్లపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద రెడ్డిని మండల టీడీపీ నాయకులు కలిశారు. శుక్రవారం తంబళ్లపల్లె టీడీపీ ఇంచార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాయచోటిలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలం ఆర్‌ఎన్ తాండా పంచాయతీ కమలాపురం క్రాస్ నుంచి బురుజుపల్లె, జుంజురపెంటల మీదుగా లింకు రోడ్డు, పెద్దేరు ప్రాజెక్టు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, పార్లమెంటు బీసీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శి సోమశేఖర్, టీడీపీ యువ నాయకుడు జగదీష్ ఉన్నారు.

నేడు వారపు సంత వేలం

పెద్దమండ్యం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం వారపు సంతల నిర్వహణకు వేలంపాటలు నిర్వహించనున్నట్లు శుక్రవారం ఎంపీడీవో శ్రీధర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు సుబ్రమణ్యం, శేషాద్రి వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పెద్దమండ్యం వారపు సంత, బస్టాండ్ గేట్ వసూలుకు శనివారం ఉదయం 11 గంటలకు, బండమీదపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లి ఆదివారం వారపు సంత, పసలబండ గేటు వసూలుకు మధ్యాహ్నం వేలం పాట జరగనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. పాల్గొనే వారు ఆయా గ్రామ సచివాలయాల్లో అధికారులు నిర్ణయించిన డిపాజిట్‌ను గంట ముందుగా చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని వారు కోరారు.


డ్వామా పీడీని కలిసిన జనసేన ఇన్‌చార్జి



పీడీ వెంకటరత్నంను కలిసిన సాయినాథ్

ములకలచెరువు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ శుక్రవారం డ్వామా పీడీ వెంకటరత్నంను కలిశారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో పీడీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నియోజకవర్గంలో విరివిగా ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలని కోరారు. ఆయన వెంట నాయకులు సుదర్శన్, ఆవుల శంకర, పవన్‌రెడ్డి, నాని, అర్జున్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షతో మంచి దిగుబడి



రైతులకు భూసార పత్రాన్ని అందజేస్తున్న డీఏవో

గుర్రంకొండ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు చేయించడం ద్వారా మంచి దిగుబడి పొంది లాభాలను సాధించవచ్చునన్ని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ అన్నారు. మండలంలోని సంగసముద్రం, గుర్రంకొండ రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మొదటగా తమ పొలం లోపాలను గుర్తించాలన్నారు. అప్పుడే భూమిని సారవంతంగా మార్చడానికి వీలుపడుతుందన్నారు. అనంతరం భూసార పరీక్షలు చేయించుకొన్న రైతులకు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏవో రత్నమ్మ, ఏఈవో అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా గుంటిగంగమ్మ ఉత్సవం





విశేషాలంకరణలో గుంటి గంగమ్మ దేవత, ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వాల్మీకిపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపర్తి గ్రామం బాహుదా నది తీరాన వెలసిన గుంటిగంగమ్మ దేవత మహోత్సవాలు రెండురోజులుగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. గురువారం అర్ధరాత్రి నుంచి చాందినీ బండ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పుష్పపల్లకిపై అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశేషాలంకరణలు గావించి గ్రామ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయంలో నిత్య కైంకర్యాల అనంతరం విశేష సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాల కాంతులతో సర్వాంగసుందరంగా దర్శనమిచ్చింది. వేలాదిగా భక్తులు రావడంతో జాతరలో సందడి వాతావరణం కనిపించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు, స్థానిక సీఐ ప్రసాద్‌బాబు, ఎస్‌ఐ చంద్రశేఖర్‌ల పర్యవేక్షణలో సుమారు 150 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి సంఘటనలకు చోటులేకుండా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమాలలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సంపద సృష్టి కేంద్రాల ఆచరణకు చర్యలు



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ

రామసముద్రం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సంపద సృష్టి కేంద్రాల ఆచరణకు చర్యలు చేపడుతున్నామని ఈవోఆర్‌డీ ఎస్‌ఏ గఫూర్, పంచాయతీ కార్యదర్శి మనుస్వామి నాయక్‌లు అన్నారు. 'చెత్త నుంచి సంపద సృష్టికి ఆచరణ శూన్యం' అన్న కథనం ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఈవోఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శి సంపద సృష్టి కేంద్రాలను తనిఖీ చేశారు. ఇందులో తయారవుతున్న ఎరువును, వర్మీకంపోస్టు తొట్టెలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ షెడ్లలో ప్రస్తుతం నాలుగు తొట్టెలలో వర్మీ తయారవుతున్నదని, నాడప్ తొట్టెలు ఐదు ఉపయోగంలో ఉన్నాయని మిగిలిన తొట్టెలన్నీ చిన్నచిన్న రిపేర్లు ఉన్న కారణంగా వాటికి మరమ్మతులపై అధికారులకు నివేదిక పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మునిస్వామి నాయక్, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి : సీపీఎం



నిరసన చేపట్టిన సీపీఎం నాయకులు

మదనపల్లెఅర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను పెడితే పగలకొడతానని ఎన్నికల సమయంలో మంగళగిరిలో మాట్లాడిన నారా లోకేశ్ ఇప్పుడు అదే మంగళగిరిలో స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే నిద్రపోతున్నారా అని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రశ్నించారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ట్రూఆప్ సర్దుబాటు, ఇతర సుంకాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మదనపల్లె విద్యుత్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో 35 వేల కోట్లు చార్జీలు పెంచితే కూటమి ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలకే 15 వేల కోట్లు చార్జీలు పెంచిందన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని ఉపసంహరించుకోవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ, ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, రాజబాబు పాల్గొన్నారు.

మురుగు కాలువలు పూడ్చితే చర్యలు తప్పవు



మురుగు కాలువలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

రామసముద్రం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మురికి నీటి కాలువలు పూడ్చి అపరిశుభ్రత కలిగిస్తే బాధితులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో భానుప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని పెద్ద కురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లెలో కొందరు తమ ఇంటి ముందు ఉన్న మురికి కాలువలు పూడ్చి వేశారని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీడీవో, పంచాయతీ సెక్రటరీ శుక్రవారం గ్రామంలో పర్యటించి పూడ్చిన కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువను పూడ్చిన వారిని విచారించారు. కాలువలు మరమ్మతులకు గురయ్యాయని, మురికి నీరు ఇంటి ముందు నిలిచి దుర్గంధం రావడంతో కాలువ పూడ్చామని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కాలువలు మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని సెక్రటరీ సూచించారు. అలాగే గ్రామంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఎంపీడీవో సెక్రటరీకి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్పనాయుడు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులకు ఏడాది పొడిగింపు

మదనపల్లెఅర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న 25 మంది స్టాఫ్ నర్సులకు ఏడాది సమయం పొడిగించినట్లు ఏపీ సెకండరీ హెల్త్ డైరెక్టర్ తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న స్టాఫ్ నర్సులకు ఫిబ్రవరి 2026 వరకు ఇక్కడే వర్క్ చేసేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. డాక్టర్లు, స్టాఫ్‌నర్సుల కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు డైరెక్టర్ పేర్కొన్నారు.

నేడు ధర్మపథంలో మహాశివుడికి అన్నాభిషేకం

వాల్మీకిపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఉదయం లింగోద్భవ మహా శివుడికి ఏకవార రుద్రాభిషేకం, అన్నాభిషేకం, పిత్రు శాంతి హోమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి కృపకు పాత్రులు కాగలరని ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు కోరారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

బి.కొత్తకోట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీలు ప్రస్తావించే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఉంటుందని తహశీల్దార్ అజారుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గోళ్లపల్లె పంచాయతీ శీతివారిపల్లెలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. వీఆర్వో నాగేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న తహశీల్దార్


వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నల్లరిబ్బన్లతో ముస్లింల నిరసన



పీలేరు అక్సా మసీదులో నిరసన తెలుపుతున్న ముస్లింలు

పీలేరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం పీలేరులోని ముస్లింలు ఆందోళన చేపట్టారు. పవిత్ర రమజాన్ మాసపు చివరి శుక్రవారం సామూహిక నమాజు కోసం తమ చేతులకు నల్లరిబ్బన్లు ధరించి ఆ బిల్లు పట్ల తమకున్న అభ్యంతరాలను వ్యక్తబరిచారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలకు సిద్ధమయ్యామన్నారు. శుక్రవారం సామూహిక నమాజు అనంతరం తమ మసీదుల ముందు వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని ప్లకార్డులు చేతబూని మౌనప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమాల్లో ముతవల్లీలు అల్లావుద్దీన్, సైఫుల్లా, తదితరులు పాల్గొన్నారు.

'డాక్టర్ల నిర్లక్ష్యం తగదు'



జిల్లా ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న యువశక్తి ఫౌండేషన్ సభ్యులు

మదనపల్లె అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సుదూరం నుంచి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య కోసం వచ్చే పేషెంట్లపై నిర్లక్ష్యం డాక్టర్లు వహించడం తగదని యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గణేష్ అన్నారు. శుక్రవారం ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గురువారం బి.కొత్తకోట నుంచి గాయాలతో వచ్చిన వ్యక్తికి సక్రమంగా డాక్టర్లు వైద్యం అందించకపోవడంతో శుక్రవారం మదనపల్లె ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చిందని వాపోయారు. ఇంత పెద్ద జిల్లా ఆస్పత్రిలో 15 మంది డాక్టర్లు ఎలా వైద్య సేవలను అందిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గణేస్, సభ్యులు మోహన్, శివాజీ, అఖిల్, నాని, విశ్వతేజ, ప్రణయ్, యోగేశ్, సిద్ధార్థ పాల్గొన్నారు.

బీసీ కులాలన్నీ ఏకతాటిపై నడవాలి

● బీసీ సంఘం నాయకుడు రాజేంద్రనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకుడు రాజేంద్రనాయుడు

మదనపల్లె అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బీసీ కులాలన్నీ ఏకతాటిపై నడిచి ఐక్యంగా పోరాటాలు సాగించి బీసీల హక్కులను సాధించుకునేందుకు కృషి చేయాలని బీసీ సంఘం నాయకుడు జన్నే రాజేంద్రనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక గొల్లపల్లె బైపాస్ రోడ్డులో ఓ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బీసీల ఆత్మీయ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు జే.రాజేంద్రనాయుడు, ఎం.సుబ్రహ్మణ్యం, పొదల నరసింహులు, కట్టా గంగులప్ప, బండి ఆనంద్, కృష్ణప్ప మాట్లాడారు. సమాజంలో మేము సగం మాకు సగం అనే నినాదంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ముందుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ జనగణన చేపట్టి తద్వారా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు చంద్రశేఖర్ నాయుడు, పద్మనాభరాజ్, చేనేత సంఘం నాగరాజు, పి.నరసింహులు, కప్పల కృష్ణమూర్తి, సర్పంచ్ గాండ్ల సంఘం ఈశ్వరయ్య, మాజీ కౌన్సిలర్స్ సురేంద్ర, సహజీవన్‌బాబు, రెడ్డెప్ప, సుబ్రమణ్యం, సుదర్శన్‌బాబు, గంపల గంగురాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

మదనపల్లెఅర్బన్, మార్చి 28: నేటి నుంచి స్థానిక నీరుగుట్టువారిపల్లె, చౌడేశ్వరీదేవి ఆలయంలో ఉగాది, చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయకమిటీ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం ఆలయంలో జ్యోతిఉత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. 29 నుంచి ఏప్రిల్ 1వ తేది వరకు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుపుతున్నట్లు చెప్పారు. 29న గణపతి, చౌడేశ్వరీదేవికి వెండి అలంకరణ, రాత్రికి దీలుమోయుట, 30 ఉగాది పండుగ రోజున ఉదయం పంచామృతాభిషేకం, సాయంత్రం విశేషాలంకరణ, రాత్రి అగ్నిగుండ ప్రవేశం, అనంతరం అమ్మవారిని అలంకరణ చేసి సింహవాహనంపై రంగురంగుల విద్యుత్ అలంకరణలతో, పిల్లనగ్రోవి వాయిద్యాల నడుమ చెక్కభజనలతో పుష్ప పల్లకి పై అమ్మవారు ఊరేగింపు జరుగును. 31న మధ్యాహ్నం నుంచి తొగట వీరక్షత్రియ సంఘం వారిచే చలివేంద్రం ఏర్పాటు, సాయంత్రం ఉట్ల తిరుణాల, పగలు తిరుణాల కన్నుల పండుగలా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1 ఉదయం జ్యోతిప్రసాదం వినియోగం, లడ్డు, అమ్మవారి చీరలు వేలం వేసిన పిదప జ్యోతి ఉత్సవాలు ముగుస్తాయి.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అమరనాథరెడ్డి



మదనపల్లెటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది అమరనాథరెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక కోర్టు సముదాయాల్లోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారి జి.మునిరెడ్డి ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. నామినేషన్లు, విత్‌డ్రా ప్రక్రియ ముగిసే సరికి సంయుక్త కార్యదర్శిగా కె.సోమశేఖర్, కోశాధికారిగా ఎన్.రెడ్డినాగులు, లైబ్రరి సెక్రటరీగా ఎస్.విజయ్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు ఎన్నికలు నిర్వహించగా మొత్తం 243 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్షుడు బి.అమరనాథరెడ్డి సమీప ప్రత్యర్థిపై 21 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అంతకు ముందు ఈసీ సభ్యులుగా ఎస్.విజయ్‌కుమార్, ఎన్.ప్రతాప్‌రెడ్డి, ఎ.శైలజ, కె.సంపత్, జి.దినేష్‌కుమార్‌రెడ్డి, పి.వి.ప్రసాద్, ఎం.వంశీధరన్, ఎస్.పర్వీజ్ అహ్మద్, జి.ఎన్.సురేష్ బాబు, సీహెచ్ శివశంకర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రోడ్డుపై అడ్డంగా నిలిచిన ఆర్టీసీ బస్సు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట రోడ్డుకు అడ్డంగా నిలిచిన ఆర్టీసీ బస్సు

గుర్రంకొండ, మార్చి 28(ఆంధ్ర జ్యోతి): గుర్రంకొండ ఎంపీడీవో కార్యాలయం ఎదుట రోడ్డుపై అడ్డంగా ఓ ఆర్టీసీ బస్సు నిలిచిపోవడంతో శుక్రవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ బస్సు గాలివీడు నుంచి గుర్రంకొండ మీదుగా మదనపల్లెకు వెళుతుంది. ఈ క్రమంలో గుర్రంకొండలో బస్టాండు వద్ద కాకుండా ఆర్టీసీ బస్సులను ఎక్కడపడితే అక్కడ తిప్పుకొని వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సు ఎంపీడీవో కార్యాలయం వద్ద రివర్స్ వస్తూ ఇంజన్‌లో సమస్య రావడంతో నడిరోడ్డుపై నిలిచిపోయింది. సుమారు గంటకుపైగా ఆర్టీసీ బస్సు రోడ్డుపై అడ్డంగా ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి కండీషన్ ఉన్న ఆర్టీసీ బస్సులను రోడ్లపై తిప్పాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

అధిక దిగుబడులు సాధించండి

కురబలకోట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో అధిక వ్యవసాయ దిగుబడులను సాధించాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని చింతమాకులపల్లెలో భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా పంటలకు ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా చాలా మంది రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదని, దీని వలన తీవ్ర నష్టాలను చూడాల్సి వస్తుందన్నారు. తమ పొలాల్లో భూసార పరీక్షలను చేయించుకోవడం ద్వారా పంట పెట్టుబడి తగ్గించడంతో పాటు అధిక ఆదాయాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకు శివశంకర్, ఏవో రాధ పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ ఊరేగింపు



పోలేరమ్మను ఊరేగిస్తున్న గ్రామస్థులు

గుర్రంకొండ, మార్చి 28(ఆంధ్ర జ్యోతి): మండలంలోని టి.పసలవాండ్లపల్లెలో పోలేరమ్మ ఊరేగింపును గ్రామస్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిన్నవండెం మండల పరిధిలోని కేశాపురం వద్ద అమ్మవారి ఆలయం ఉంది. ఈ క్రమంలో అమ్మవారి జాతరను గత వారం వైభవంగా నిర్వహించారు. జాతర అనంతరం అమ్మవారు టి.పసలవాండ్లపల్లె పంచాయితీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఊరేగించేశారు. కొన్నేళ్లుగా అమ్మవారిని ఊరేగించకుండా ఉంచేశారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని గ్రామంలో రెండు రోజుల పాటు ఊరేగించారు. ప్రజలు, భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు దొరస్వామినాయుడు, రెడ్డెప్ప, రామాంజులనాయుడు, చలపతి పాల్గొన్నారు.

జాతీయస్థాయి టోర్నమెంట్‌లో మదనపల్లె విద్యార్థుల ప్రతిభ

మదనపల్లెటౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఉడ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి సీనియర్స్, జూనియర్స్ టోర్నమెంట్‌లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ కనపరచి ఆలిండియా స్థాయిలో రన్నరప్‌గా నిలిచారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ స్టేడియంలో ఈ నెల 23 నుంచి 26వ తేది వరకు ఆలిండియా ఉడ్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో 28 రాష్ట్రాల నుంచి పురుషులు, మహిళల జట్లు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో మహారాష్ట్ర జట్టు విజేతగా నిలవగా, ఆంధ్ర జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన నలుగురు పురుషులు, నలుగురు మహిళలు రాష్ట్ర ఉడ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనపరచిన తమ విద్యార్థులు ఆలిండియా ఉడ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అభిషిక్త్ దేశ్‌ముఖ్ చేతుల మీదుగా రన్నరప్ షీల్డు అందుకున్నారన్నారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీలు శరత్‌నాయక్, జగదీష్‌లు అభినందించారు.



జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచిన ఆంధ్రజట్టు సభ్యులు

పంచాయతీకి రూ.4.07 లక్షల ఆదాయం

ములకలచెరువు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు గ్రామ పంచాయతీకి వారపు సంత వేలం ద్వారా రూ.4.07 లక్షలు ఆదాయం వచ్చింది. స్థానిక గ్రామ సచివాలయంలో శుక్రవారం వారపు సంతలో రుసుం వసూలుకు వేలంపాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా ములకలచెరువుకు చెందిన భజంత్రి రామాంజులు అత్యధికంగా వేలం పాడి హక్కును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, పంచాయతీ కార్యదర్శి ఆజాద్, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.